'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 22 | ఆదివారం | 6.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 22 | Sunday | 6.9.2026 | Pages: 8 | Rate: 2

## జగన్-జాతకమ్ జూన్ నుంచి జాతకంలో మలుపు?



జ్యోతిష్యుల గణాంకాలు, జ్యోతిష్య గణనల ప్రకారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ జాతకంలో జూన్ నుంచి కీలక మార్పులు మొదలయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. జగన్ మిథున రాశికి చెందినవారని పేర్కొంటూ.. శని లాభస్థానమైన 11వ ఇంట్లోకి రావడం రాజకీయంగా జన సమీకరణకు అనుకూలంగా మారుతుందని జ్యోతిష్యుల అంచనాగా వెల్లడించారు.

**జన సమీకరణపై జ్యోతిష్య అంచనా**

11వ ఇంట్లో శని సంచారం కారణంగా భారీ స్థాయిలో ప్రజా సమీకరణ జరిగే అవకాశం ఉందని జ్యోతిష్య పరంగా చెబుతున్నారు. జగన్ చేపట్టబోయే పాదయాత్రకు కూడా ఈ గ్రహస్థితులు అనుకూలంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇదే క్రమంలో జూలై నుంచి పాదయాత్ర ప్రారంభించే అవకాశం ఉందన్న సమాచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

**గురుబలం కూడా తోడైతే**

జగన్ జాతకంలో గురువు రెండో ఇంట ఉచ్ఛస్థానంలో ఉండటం మరో కీలక అంశంగా జ్యోతిష్యులు పేర్కొంటున్నారు. గురుబలం కారణంగా ఆయనకు ఊహించని శక్తుల సహకారం లభించే అవకాశాలు ఉన్నాయని వారి గణన. శని సంచారం, గురుబలం కలిసివచ్చే సమయంలో రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకోవచ్చని అంచనా.

**ఏపీ రాజకీయాల్లో మార్పుల సంకేతాలా?**

జూన్ 27 నుంచి శని మిథున రాశి వారికి ప్రభావం చూపే దశ ప్రారంభమవుతుందని జ్యోతిష్య గణనల్లో పేర్కొంటున్నారు. దీనికి అనుసంధానంగానే జగన్ తన పాదయాత్రను విస్తరించే ఆలోచన చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రహస్థితుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్వల్ప మార్పుల నుంచి సంచలన పరిణామాల వరకు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని జ్యోతిష్యుల అంచనాలు చెబుతున్నాయి.

# కల్వకుంట్ల ఫ్యామిలీ..కాస్కో ?

## కేసీఆర్‌కు రేవంత్ బిగ్ ఛాలెంజ్




వివరాలు2లో..

- » సిరిసిల్ల, సిద్దిపేటపై కాంగ్రెస్ గురి
- » అసెంబ్లీకి రా.. అన్నీ తేల్చుకుందాం
- » సీట్లు పెరిగితే 117, లేదంటే 90 గెలుస్తాం
- » వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ. 22 కోట్లు ఖర్చు
- » ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు
- » ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?
- » ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- » వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం
- » నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

నల్గొండ జిల్లా నకిరేకల్ సభ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సూటి సవాల్ విసిరారు. ఏ అంశంపైనైనా చర్చకు తాను సిద్ధమని, కేసీఆర్‌కు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రావాలని అన్నారు. ప్రభుత్వ సొమ్ము తీసుకుంటూ అసెంబ్లీకి రాకపోవడం ఎందుకని, ప్రజల సమస్యలను సభలో ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. వెయ్యి రోజుల్లో కేసీఆర్‌పై రూ.22 కోట్ల ప్రభుత్వ వ్యయం జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ మొక్కను మళ్లీ మొలకెత్తనివ్వబోమని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ప్రకటించారు. "ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా.. కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా. వచ్చే నెల సిద్దిపేటకు వస్తా.. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## రేవంత్-రాజన్న ముచ్చట్లు

**నకిరేకల్ సభ వేదికగా మంతనాలు**

తాను సీఎం రేవంత్‌రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని స్పష్టం చేశారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ముఖ్యమంత్రితో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని తెలిపారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల స్థాయిలోనే మునుగోడుకు కూడా రూ.2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసించారు. త్వరలో జరిగే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో హాజరవుతానని ప్రకటించారు. నకిరేకల్ సభలోనూ రాజగోపాల్‌రెడ్డి వ్యవహరించిన తీరు ఆసక్తి రేపింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో వేదికపైనే సుదీర్ఘంగా చర్చించారు.






## వాట్ వెంట్ రాంగ్!

### వామ్మో కొండా.. మాకొద్దంటున్న పార్టీలు

**రాజకీయంగా దారులన్నీ మూసుకుపోయాయా?**

**కానీ జనసేన ఆప్షన్ ఉందంటున్న అభిమానులు!**

కొండా దంపతుల పయనమెటు? ఒకప్పుడు ప్రత్యర్థులకు వణుకు పుట్టించిన కొండా దంపతులు.. ఇప్పుడు రాజకీయ దారుల కోసం వెతుకుతున్నారా? తెలంగాణ రాజకీయాల్లో కొండా దంపతుల చుట్టూ నెలకొన్న పరిణామాలు కొత్త చర్చకు తెరలేపుతున్నాయి. ఒకవైపు కూతురు సుస్మిత వ్యాఖ్యలు.. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం హెచ్చరికలు.. మధ్యలో కొండా సురేఖ రాజకీయ భవిష్యత్తుపై సందిగ్ధత. బిడ్డకు అండగా నిలిస్తే పార్టీతో దూరం పెరిగే పరిస్థితి.. పార్టీతో కొనసాగితే కుటుంబపరమైన ఒత్తిడి తప్పని పరిస్థితి కనిపిస్తోంది. బయటకు వెళ్లాలనుకుంటే మాత్రం ప్రత్యామ్నాయ ద్వారాలు కూడా అంత సులభంగా తెరుచుకోవడం లేదు. బీఆర్ఎస్ నుంచి గట్టి నిరాకరణ.. బీజేపీ నుంచి అసంతృప్త నేతలపై స్పష్టమైన సంకేతాలతో కొండా దంపతుల ముందున్న ఆప్షన్లు క్రమంగా తగ్గుతున్నాయన్న చర్చ సాగుతోంది. గతంలో ప్రత్యర్థులపై చేసిన ఘాటు వ్యాఖ్యలు కూడా ఇప్పుడు రాజకీయ లెక్కల్లోకి వస్తున్నాయి. ఇలాంటి సమయంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ రాజకీయ పునాది కాపాడుకోవడమా.. లేక జనసేన రూపంలో కొత్త దారి వెతుక్కోవడమా? కుటుంబం ఒక దిశలో.. రాజకీయ ప్రయాణం మరో దిశలో సాగుతున్న వేళ.. కొండా దంపతుల తదుపరి అడుగు ఏంటి? ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది.



## కొండా చేరికకు బీజేపీ బ్రేక్

**ఎవరినీ పడితే వారిని చేర్చుకోం**

**చేరికలపై మురళీధర్‌రావు క్లారిటీ**

మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు ఖండించారు. పార్టీలోకి కొత్త నేతల చేరిక విషయంలో బీజేపీకి స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని తేల్చిచెప్పారు. కొండా సురేఖ చేరికపై వస్తున్న వార్తల వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం కొనసాగుతోందని, ఆ సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ప్రచారం తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. (2లో..)



## సురేఖను కాపాడేందుకు ప్రయత్నించాం

**హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యం**

**బర్తరఫ్‌పై మహేశ్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు**

కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించకుండా కాపాడేందుకు తమ వంతుగా తీవ్రంగా ప్రయత్నించామని తెలిపారు. శనివారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. సురేఖ విషయంలో అందరం ప్రయత్నం చేసినా బర్తరఫ్ నిర్ణయం పూర్తిగా ఏఐసీసీ పరిధిలో తీసుకున్న నిర్ణయమేనని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

## రాష్ట్రంలో నిషేధించాల్సింది కాంగ్రెస్‌నే

- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి
- రేవంత్ పాలనను ఎండగట్టిన కేటీఆర్



కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరిలో ఆయన రేవంత్ సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యూత్ డిక్లరేషన్ అమలు కాలేదని, నోటిఫికేషన్లకు బదులు లూటిఫికేషన్ జరుగుతోందని, జాబ్ క్యాలెండర్ స్థానంలో స్కాం క్యాలెండర్ నడుస్తోందని ఆరోపించారు. (2లో..)

## రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదు రేవంత్

- ప్రజలను వంచించి సంబరాలు చేసుకుంటారా?
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి- హరీశ్ రావు



కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ అసెంబ్లీలో పోరాడుతోందని చెప్పారు. జీఓ నంబర్ 97 రద్దు, రైతులకు న్యాయమైన విద్యుత్ వంటి అంశాలను సభలో లేవనెత్తుతున్నామని తెలిపారు (వివరాలు 2లో..)



## హైదరాబాద్‌లో ఏఐ మెగా బూమ్

**• టీసీఎస్ రూ.70 వేల కోట్ల పెట్టుబడి • 264 ఎకరాల్లో అతిపెద్ద క్యాంపస్**

హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటు కానుంది. టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ 264 ఎకరాల భూమిని దక్కించుకుని, భాగస్వాములతో కలిసి రూ.70 వేల కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. గరిష్ఠంగా 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు వినియోగించుకునేలా అధునాతన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. అధిక సామర్థ్యం కలిగిన కంప్యూటింగ్ వ్యవస్థల కోసం లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. (వివరాలు 2లో..)




## పాలు లేకుండానే పనీర్..

**కల్తీ దెబ్బకు హైదరాబాద్ ఉలిక్కిపాటు**

**అసలేం జరుగుతోందన్న ఆందోళన**




## జైలుకు పంపించేస్తా

**ఓపెన్‌ఏఐ, ఆంత్రాపిక్ సీఈఓలకు వార్నింగ్**

**ఏఐపై బెర్నీ సాండర్స్ బిగ్ బిల్**

**సూపర్ ఇంటెలిజెన్స్‌పై శాశ్వత నిషేధం**



## చూపులు కలిసిన శుభవేళ

**లైలా నుంచి మజ్ను ఏం కోరుకున్నాడు..!**

**రోమియో నుంచి జూలియట్ కోరుకున్నదేంటి?**

**పవిత్ర ప్రేమ నుంచి అపవిత్ర బంధాల దాకా**

**అవసరాల కోసమే సంబంధాల ప్రేమాయణం**

7లో..

ప్రేమ చిత్రాల్లో కనిపించే ఆ చూపులు గుర్తున్నాయా? ఒక చూపుతోనే కథ మొదలవుతుంది.. మరో చూపుతో మనసు మారుతుంది.. ఆ తర్వాత ప్రపంచమే మరిచిపోయేంతగా ప్రేమలో మునిగిపోతారు. లైలా కోసం మజ్ను కోరుకున్నది కేవలం ఆమె సాన్నిహిత్యమా? జూలియట్ కోసం రోమియో వెతికింది కేవలం ఒక క్షణిక ఆకర్షణనేనా? ప్రేమ కథల్ని చూస్తే సమాధానం అంత సులభంగా రాదు. ప్రేమలో కోరిక ఉంటుంది.. ఆకర్షణ ఉంటుంది.. స్పర్శ కోసం తపన ఉంటుంది. కానీ వాటన్నింటికంటే ముందు ఒక మనసు మరో మనసును కోరుకుంటుంది. ఒకరి చూపులో తన ప్రపంచాన్ని వెతుక్కుంటుంది. ఒకరి మాట కోసం ఎదురు చూస్తుంది. ఒకరి కోసం తనలో తాను మారిపోతుంది. నేటి కాలంలో ఆ ఎదురుచూపు తగ్గింది.. పరిచయం క్షణాల్లో మొదలవుతోంది. మెసేజ్‌తో సాన్నిహిత్యం.. లైక్‌తో ఆకర్షణ.. కలయికతో సంబంధం. కానీ ఇది నిజంగా ప్రేమేనా? లేక అవసరానికి పెట్టుకున్న అందమైన పేరా? చూపులు కలిసిన ఆ శుభవేళ నుంచి పవిత్ర ప్రేమ.. అపవిత్ర బంధం మధ్య అసలు గీత ఎక్కడ మొదలవుతుంది?

## రియల్ ఎస్టేట్ కంపెనీగా రాష్ట్రం

**• 22ఏ భూములపై బీజేపీ సమరం • బేషరతుగా తొలగించాలని డిమాండ్**
**• ఢిల్లీకి కప్పం కట్టేందుకేనన్న కిషన్ రెడ్డి**



హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీజేపీ నిర్వహించిన మహాధర్నాలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. భూభారతి-22ఏ నిబంధనల పేరుతో రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజల భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చుతున్నారని మండిపడ్డారు. పట్టాలు ఉండి, ఇంటి అనుమతులు, విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి కనెక్షన్లు ఉన్న భూములను కూడా 22ఏ జాబితాలో చేర్చడం దుర్మార్గమని అన్నారు. తెలంగాణను 'రేవంత్‌రెడ్డి-రాహుల్‌గాంధీ ప్రైవేట్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీ'గా మార్చారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. (2లో..)

## ప్రజల భూములపై దండయాత్ర

**• భూములను దోచుకునేలా స్కీమ్స్ • రేవంత్ సర్కారుపై బీజేపీ చీఫ్ ఫైర్**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తోందని బీజేపీ నేతలు ఆరోపించారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని విమర్శించారు. 22-ఏ బాధితుల తరఫున తమ గొంతు వినిపించేందుకు సైతం న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుమతి పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతింటి కలను సాకారం చేసుకున్న సామాన్యుల ఆస్తుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. (వివరాలు 2లో..)



# రేవంత్-రాజన్న ముచ్చట్లు

**నకిరేకల్ సభ వేదికగా మంతనాలు**

తాను సీఎం రేవంత్‌రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని స్పష్టం చేశారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ముఖ్యమంత్రితో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని తెలిపారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల స్థాయిలోనే మునుగోడుకు కూడా రూ.2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసించారు. త్వరలో జరిగే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో హాజరవుతానని ప్రకటించారు. నకిరేకల్ సభలోనూ రాజగోపాల్‌రెడ్డి వ్యవహరించిన తీరు ఆసక్తి రేపింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో వేదికపైనే సుదీర్ఘంగా చర్చించారు. సీఎంతో రాజగోపాల్‌రెడ్డి తీవ్రంగా మంతనాలు జరుపుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**కోమటిరెడ్డి బ్రదర్స్‌పై ఆసక్తికర చర్చ**

సభలో రేవంత్‌రెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరును ప్రస్తావించగానే ప్రజల నుంచి హర్షధ్వానాలు వినిపించడం మరో ఆసక్తికర పరిణామంగా మారింది. ఇదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పనిమీద హైదరాబాద్‌కు వెళ్లడం రాజకీయ చర్చకు కారణమైంది. సొంత జిల్లాలో సీఎం సభ జరుగుతున్న సమయంలో మంత్రి గైర్హాజరు కావడంపై భిన్నమైన ఊహాగానాలు వినిపించాయి. మరోవైపు కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై రాజగోపాల్‌రెడ్డి ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేశారు. మంత్రి పదవిపై హామీ ఉన్నప్పటికీ తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానానిదేనని, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే తన లక్ష్యమని, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తూ తెలంగాణలో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.



# హైదరాబాద్‌లో ఏఐ మెగా బూమ్

- **టీసీఎస్ రూ.70 వేల కోట్ల పెట్టుబడి**
- **264 ఎకరాల్లో అతిపెద్ద క్యాంపస్**

కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో మార్పులకు అనుగుణంగా ప్రాజెక్టును దశలవారీగా నిర్మించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో టీసీఎస్ ప్రతినిధులు కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రాష్ట్రానికి, దేశానికి చారిత్రాత్మకమైనదిగా సీఎం అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో ముందుకు వెళ్తోందని తెలిపారు. ఏఐ మోడళ్లకు అవసరమైన కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక మౌలిక సదుపాయంగా మారనుందని చెప్పారు.

**వేల ఉద్యోగాలు.. గ్రీన్ క్యాంపస్**

ఈ భారీ పెట్టుబడితో హైదరాబాద్‌లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. డేటా సెంటర్‌తో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, వాటర్‌న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్‌ను నిర్మించనున్నారు. టీసీఎస్ సీఈఓ, ఎండీ కే. కృతివాసన్ ఈ ప్రాజెక్టు తమ 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌టు ఇంటెలిజెన్స్' వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో అవసరమైన ప్రతిభ, సాంకేతిక వాతావరణం, మౌలిక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం 2026 జనవరిలో దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన భేటీ కీలక మలుపుగా నిలిచింది. అనంతరం తెలంగాణ ప్రభుత్వం, టీసీఎస్ మధ్య చర్చలు కొనసాగాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నా తెలంగాణ ఈ ప్రాజెక్టును దక్కించుకుంది. దీంతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి భారీ ఊతం లభించింది.

# కొండా చేరికకు బీజేపీ బ్రేక్

**ఎవరినీ పడితే వారిని చేర్చుకోం**

**చేరికలపై మురళీధర్‌రావు క్లారిటీ**



"ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని తేల్చిచెప్పారు. కొండా సురేఖ చేరికపై వస్తున్న వార్తల వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం కొనసాగుతోందని, ఆ సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ప్రచారం తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ బీజేపీలో చేరతారన్న వార్తలకు మురళీధర్‌రావు వ్యాఖ్యలు స్పష్టత ఇచ్చినట్లయ్యాయి. ఇదే సమయంలో తెలంగాణ రాజకీయాలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. పార్టీలో చేరికల విషయంలో నేతల రాజకీయ నేపథ్యం, ప్రజల్లో ఉన్న ఆదరణ వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. దీంతో కొండా సురేఖ బీజేపీ చేరికపై సాగుతున్న ఊహాగానాలకు ప్రస్తుతానికి బ్రేక్ పడినట్టయింది.

# సురేఖను కాపాడేందుకు ప్రయత్నించాం

- **హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యం**
- **బర్తరఫ్‌పై మహేశ్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు**



కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించకుండా కాపాడేందుకు తమ వంతుగా తీవ్రంగా ప్రయత్నించామని తెలిపారు. శనివారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. సురేఖ విషయంలో అందరం ప్రయత్నం చేసినా బర్తరఫ్ నిర్ణయం పూర్తిగా ఏఐసీసీ పరిధిలో తీసుకున్న నిర్ణయమేనని స్పష్టం చేశారు. ఆమె విషయంలో హైకమాండ్ నిర్ణయానికి అంగీకరించలేదని తెలిపారు. ఢిల్లీలో జరిగిన చర్చల్లోనూ ప్రధానంగా కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగిందని చెప్పారు. ఇదే సమయంలో మంత్రివర్గ విస్తరణపై వస్తున్న ప్రచారానికి మహేశ్‌గౌడ్ తెరదించారు. ప్రస్తుతం క్యాబినెట్ విస్తరణకు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని, హైకమాండ్ నుంచి కూడా ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరగాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయమని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి వస్తుందన్న ప్రచారంపై కూడా తనకు సమాచారం లేదన్నారు. రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ ఆశయాలను నెరవేర్చారని చెప్పిన మహేశ్‌గౌడ్, కులగణనను శాస్త్రీయంగా నిర్వహించామని తెలిపారు. బీసీ హక్కుల కోసం దేశవ్యాప్తంగా వంద రోజుల ఉద్యమం చేపడతామని ప్రకటిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కల్వకుంట్ల ఫ్యామిలీ..కాస్కో?

## కేసీఆర్‌కు రేవంత్ బిగ్ ఛాలెంజ్

- **నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి**




నల్గొండ జిల్లా నకిరేకల్ సభ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సూటి సవాల్ విసిరారు. ఏ అంశంపైనైనా చర్చకు తాను సిద్ధమని, కేసీఆర్‌కు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రావాలని అన్నారు. ప్రభుత్వ సొమ్ము తీసుకుంటూ అసెంబ్లీకి రాకపోవడం ఎందుకని, ప్రజల సమస్యలను సభలో ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. వెయ్యి రోజుల్లో కేసీఆర్‌పై రూ.22 కోట్ల ప్రభుత్వ వ్యయం జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ మొక్కను మళ్లీ మొలకెత్తనివ్వబోమని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ప్రకటించారు. "ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా.. కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా. వచ్చే నెల సిద్దిపేటకు వస్తా.. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ప్రకటించారు. "ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా.. కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా. వచ్చే నెల సిద్దిపేటకు వస్తా.. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**117 సీట్లపై రేవంత్ ధీమా**

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సీట్లు పెరిగితే కాంగ్రెస్ 117 స్థానాలు గెలుస్తుందని, ప్రస్తుత సీట్లే కొనసాగితే 90సీట్లు సాధిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేయలేదని, వాటిని మరింత మెరుగ్గా కొనసాగిస్తున్నామని చెప్పారు. రైతులకు రైతుభరోసా, ధాన్యం కొనుగోలు, బోనస్, ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించకుండా వెళ్లిపోయిన రూ.36 వేల కోట్ల రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు కేటాయించామని, కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.

**నకిరేకల్‌లో అభివృద్ధికి శ్రీకారం**

రాజకీయ విమర్శలతో పాటు నకిరేకల్ అభివృద్ధిపై సీఎం దృష్టి పెట్టారు. రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించారు. ఆస్పత్రిలోని విభాగాలను పరిశీలించి, రోగులకు అందించే సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో రూ.345 కోట్లతో 12 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నకిరేకల్ కాంగ్రెస్‌కు కంచుకోటగా మారిందని, వేముల వీరేశం దానిని నిరూపించారని రేవంత్ అన్నారు. అదే సమయంలో కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ "నీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం" అంటూ సవాల్ చేశారు. తెలంగాణను బీఆర్ఎస్ హయాంలో దోచుకున్నారని ఆరోపించిన సీఎం, వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.







# రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదు రేవంత్

- **కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి- హరీశ్ రావు**



ప్రభుత్వం కుంభకోణాలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదు.. రేవంత్‌రెడ్డేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

**జీవో 22ఏతో భూముల చిక్కులు**

సిద్దిపేట, దుబ్బాక జిల్లాల్లో పర్యటించిన హరీశ్‌రావు స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల జిల్లాలో అర్హులకు పట్టాలు ఇచ్చేందుకు జీఓ 76 తీసుకొచ్చామని చెప్పారు. ప్రజలకు భూమిపై హక్కులు కల్పించడం, వారికి సౌకర్యం కల్పించడమే అప్పటి నిర్ణయం ఉద్దేశమని తెలిపారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 22ఏ కారణంగా గతంలో పంపిణీ చేసిన పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. దీంతో పట్టాలు చేతిలో ఉన్నా భూముల లావాదేవీలు, ఇతర వ్యవహారాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ భూముల భవిష్యత్తుపై స్పష్టత లేక పలువురు ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

**ప్రజల తరఫున పోరాటమే**

జీఓ 76 కింద గతంలో ఇచ్చిన పట్టాలను పరిగణనలోకి తీసుకుని జీఓ 22ఏ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో చేర్చిన పట్టా భూముల సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. మంచిర్యాలతో పాటు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఆయన, భూములు, పట్టాల అంశంపై బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ఎల్పీకి అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చర్చ జరుగుతున్న సమయంలో భూముల సమస్యను ప్రధాన అస్త్రంగా చేసుకుని ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్న సంకేతాలను హరీశ్‌రావు వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# రాష్ట్రంలో నిషేధించాల్సింది కాంగ్రెస్‌నే

## రేవంత్ పాలనను ఎండగట్టిన కేటీఆర్



యూత్ కమిషన్, ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్, నిరుద్యోగ భృతి, యువతకు రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొలువుల కుంభమేళా తెస్తామని చెప్పి కుంభకోణాల కుంభమేళా తెచ్చారని మండిపడ్డారు.

**రాజీనామా ఎవరు చేయాలి?**

కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు చేస్తున్న డిమాండ్‌పై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలని, వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డే రాజీనామా చేయాలని ప్రశ్నించారు. 2006లో కరీంనగర్ గడ్డపై కేసీఆర్ రాజీనామా చేసిన సందర్భాన్ని గుర్తుచేశారు. యువతతో పెట్టుకుంటే పెద్దపెద్ద నాయకులే దిగిపోయారని, విద్యార్థులు, యువత పోరాటాలే చరిత్రను మార్చాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆరోపిస్తూ "ఓటింగ్ అయిపోయింది.. చీటింగ్ మాత్రమే మిగిలింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. యువత నిప్పుకణికలై మారి ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో నిషేధించాల్సింది కాంగ్రెస్ పార్టీనే అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సభలో రాజకీయ వేడి పెంచాయి.

**జీఓ 97పై విద్యార్థులకు అండ**

సిరిసిల్లలో జీఓ 97కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు కేటీఆర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జీఓ 97ను తక్షణమే రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాలతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని హెచ్చరించారు. "తుగ్లక్ నిర్ణయాలతో విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోం" అని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతవరకైనా పోరాడుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఒకవైపు వెయ్యి రోజుల పాలనపై యువతలో అసంతృప్తిని ఎత్తిచూపుతూ, మరోవైపు జీఓ 97ను ప్రధాన అంశంగా చేసుకుని విద్యార్థుల పక్షాన పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదే స్పష్టమైన హెచ్చరిక అంటూ కేటీఆర్ తన వ్యాఖ్యలను ముగించారు.

# రియల్ ఎస్టేట్ కంపెనీగా రాష్ట్రం



## ఢిల్లీకి కప్పం కట్టేందుకేనన్న కిషన్ రెడ్డి

గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను విక్రయించిందని ఆరోపించిన కిషన్‌రెడ్డి, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ భూములు, హౌసింగ్ బోర్డు స్థలాలు, పార్కులు, దేవాదాయ శాఖ భూముల విక్రయాలపై ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను విక్రయించిందని ఆరోపించిన కిషన్‌రెడ్డి, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ భూములు, హౌసింగ్ బోర్డు స్థలాలు, పార్కులు, దేవాదాయ శాఖ భూముల విక్రయాలపై ప్రశ్నలు లేవనెత్తారు.

**60 లక్షల ఎకరాలపై ప్రశ్నలు**

తెలంగాణలో సుమారు 60 లక్షల ఎకరాలకు పైగా భూములు 22ఏ కింద చేర్చినట్లు కిషన్‌రెడ్డి ఆరోపించారు. ధరణిలో ఉన్న లోపాలను సరిచేయాల్సిన ప్రభుత్వం వాటిని మరింత పెంచి ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తోందని విమర్శించారు. 22ఏ జాబితా, భూముల విక్రయాలు, ప్రైవేట్ సెటిల్‌మెంట్ల ద్వారా భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ అందడం లేదని అన్నారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా పీడనగా మారిందని వ్యాఖ్యానించారు. విపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేయడం, ప్రజా ఆందోళనలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తోందని మండిపడ్డారు. నల్గొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ, పరామర్శకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

**బీజేపీ పోరాటం ఆగదని హెచ్చరిక**

22ఏ జాబితాలోకి పేదల భూములను నెట్టిన అధికారులు, అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలను కిషన్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. అధికారులు, నేతల అక్రమాలకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద భద్రంగా ఉన్నాయని చెప్పారు. 2029లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి పైసాకు లెక్క చెబుతామని స్పష్టం చేశారు. రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన రైతులు, ప్రజల భూములను బేషరతుగా తక్షణమే తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన వారి ఆశయాలకు విరుద్ధంగా పేదలకు అన్యాయం జరిగితే బీజేపీ చూస్తూ ఊరుకోదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచి 22ఏ భూ సమస్య వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు. 22ఏ అక్రమాలపై బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరచాలని, గ్రామస్థాయి నుంచి అసెంబ్లీ వరకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రజల భూములపై దండయాత్ర

- **రేవంత్ సర్కారుపై బీజేపీ చీఫ్ ఫైర్**



ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో సొంతింటి కలను సాకారం చేసుకున్న సామాన్యుల ఆస్తుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. హైడ్రా, క్యూర్, 22-ఏ పేర్లతో ప్రజల్లో భయం, అనిశ్చితి పెరుగుతోందని ఆరోపించారు. సొంత ఆస్తి ఉన్నప్పటికీ అది నిషేధిత జాబితాలో చేరుతుందేమోనన్న ఆందోళనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దురుద్దేశంతో ప్రజల భూములపై కన్నేసిందని విమర్శించారు. తె హైడ్రా, క్యూర్, 22-ఏ పేర్లతో ప్రజల్లో భయం, అనిశ్చితి పెరుగుతోందని ఆరోపించారు. సొంత ఆస్తి ఉన్నప్పటికీ అది నిషేధిత జాబితాలో చేరుతుందేమోనన్న ఆందోళనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దురుద్దేశంతో ప్రజల భూములపై కన్నేసిందని విమర్శించారు.

**తప్పులు సరిచేయాలని డిమాండ్**

22-ఏ అంశంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది. నిషేధిత జాబితాలో తప్పుగా చేర్చిన వాస్తవ ఆస్తులను ప్రభుత్వం తక్షణమే తొలగించాలని కోరింది. తప్పులు జరిగాయని ప్రభుత్వం స్వయంగా అంగీకరిస్తున్నప్పుడు వాటిని ఎందుకు సరిచేయడం లేదని ప్రశ్నించింది. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అసలు ఆస్తి యజమానుల్లో భయం, అనిశ్చితి ఎందుకు సృష్టిస్తోందని నిలదీసింది. 22-ఏ జాబితాలో అన్యాయంగా చేర్చిన భూములపై స్పష్టత ఇవ్వడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించింది. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. సాధారణ పౌరుడు ఏళ్ల తరబడి సంపాదించిన ఆస్తిపై హక్కును ప్రశ్నించే పరిస్థితి రాకూడదని, 22-ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు పోరాటం కొనసాగుతుందని బీజేపీ నేతలు తేల్చిచెప్పారు.

# కూటమిపై బొత్స ఫైర్

(మొదటి పేజీ తరువాయి..)
వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో 10 వేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలు, సుమారు లక్షన్నర సచివాలయ ఉద్యోగాలు పారదర్శకంగా భర్తీ చేశామని బొత్స పేర్కొన్నారు. తమ హయాంలో ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకున్నారనే ఒక్క ఆరోపణ కూడా రాలేదని అన్నారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాల్లో వెలుగులోకి వస్తున్న అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



**మైనింగ్, గంజాయిపైనా మండిపాటు**

రాష్ట్రంలో పాలన తీరుపైనా బొత్స తీవ్ర స్థాయిలో స్పందించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువే ఉంటుందని వ్యాఖ్యానించారు. అనకాపల్లి జిల్లాలో ఎక్కడ చూసినా మైనింగ్ జరుగుతోందని, ఏపీ గంజాయి మత్తులో చిక్కుకుందని ఆరోపించారు. వాస్తవాలను ప్రశ్నిస్తున్న వారి సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసే అధికారం ఎవరికి ఉందని నిలదీశారు. విశాఖ నగరాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, గీతం యూనివర్సిటీకి వేల కోట్ల విలువైన భూములు అప్పగించారని విమర్శించారు. పోలవరం ఎడమ కాలువకు గ్రావిటీ ద్వారా నీరు ఇవ్వాలని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా శ్రీకాకుళం వరకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా నీరు ఇచ్చి గోదావరి జలాలు ఇచ్చామని ప్రచారం చేసుకోవద్దన్నారు. పోలవరం ప్రాజెక్టుకు వైఎస్సార్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోటీ చేసి గెలిచి తీరుతుందని బొత్స స్పష్టం చేశారు.

# ఆ కుటుంబాలకు ప్రత్యామ్నాయం

(మొదటి పేజీ తరువాయి..)
ఏపీలో రెండు కుటుంబాల చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయని విజయసాయి రెడ్డి విమర్శించారు. ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని పనిచేసే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమని ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారు, ప్రతిపక్షంలో ఉన్నవారు ప్రజల ఆశలు, అవసరాలకు పూర్తిస్థాయిలో ప్రతినిధ్యం వహించలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కొత్త పార్టీ ద్వారా సామాన్యుడి గొంతుకగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రెండు కుటుంబాల ఆధిపత్యాన్ని తగ్గించి ప్రజల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకునే పాలన అందించడమే తన లక్ష్యమని చెప్పారు. విజయసాయి కొత్త పార్టీ ఆవిర్భావంతో ఏపీ రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయం చర్చకు వస్తుందా? అన్న ఆసక్తి మొదలైంది. సెప్టెంబర్ 7న విజయవాడలో ఆయన వెల్లడించే రాజకీయ కార్యాచరణపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

# వేల కోట్ల ఆస్తులా.. రూ.31 కోట్లేనా?

- రూ.980 కోట్ల రుణాల వెనుక లెక్కేంటి?
- సుభాష్‌చంద్ర నెట్‌వర్త్‌పై సీబీఐ ఫోకస్

ఎస్సెల్ గ్రూప్ మాజీ ఛైర్మన్ సుభాష్‌చంద్రపై సీబీఐ నమోదు చేసిన కేసులో ఇప్పుడు ఆయన నెట్‌వర్త్ భారీగా మారిపోయిన వ్యవహారం ప్రధాన అంశంగా మారింది. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి సుమారు రూ.980 కోట్ల రుణాలు పొందిన వ్యవహారంలో మోసం, నమ్మకద్రోహం, కుట్ర ఆరోపణలపై దర్యాప్తు మొదలైంది. ఈ రుణాలకు సుభాష్‌చంద్ర గ్యారంటీదారుగా వ్యవహరించారు. రుణాలు తీసుకునే సమయంలో సమర్పించిన నెట్‌వర్త్ సర్టిఫికెట్లలో ఆయన ఆస్తుల విలువ వేల కోట్ల రూపాయలుగా చూపించినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. 2018లో సమర్పించిన ఒక సర్టిఫికెట్ ప్రకారం 2017 మార్చి నాటికి ఆయన నెట్‌వర్త్ సుమారు రూ.59 వేల కోట్లుగా పేర్కొన్నారు. మరో రుణానికి సమర్పించిన సర్టిఫికెట్‌లో ఆయన ఆస్తుల విలువ రూ.40 వేల కోట్లకు పైగా ఉన్నట్లు చూపించారు. అయితే రెండు రుణాలు కూడా తర్వాత డిఫాల్ట్ అయ్యాయి. దీంతో సుభాష్‌చంద్రపై వ్యక్తిగత దివాలా ప్రక్రియ మొదలైంది.

**రుణం వేళ ఒక లెక్క.. తర్వాత మరో లెక్క**

అసలు వివాదానికి కేంద్రంగా మారింది ఇదే. ఐబీసీ కింద జరిగిన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో సుభాష్‌చంద్ర తన ఆస్తుల విలువ అంత భారీగా లేదని చెప్పినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఆరోపణలు ఉన్నాయి. 2024లో తన నెట్‌వర్త్ సుమారు రూ.31.79 కోట్లుగా ప్రకటించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రుణాల సమయంలో వేల కోట్ల నెట్‌వర్త్ చూపించడం, తర్వాత చాలా తక్కువ ఆస్తుల విలువను వెల్లడించడం మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఇప్పుడు దర్యాప్తులో కీలకంగా మారింది. రుణాలు పొందేందుకు నెట్‌వర్త్‌ను ఉద్దేశపూర్వకంగా పెంచి చూపించారా? సర్టిఫికెట్లు ఎవరు తయారు చేశారు? వాటిని ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఎలా పరిశీలించింది? రూ.980 కోట్ల రుణాలు ఏ ప్రయోజనం కోసం వినియోగించారు? అనే అంశాలను సీబీఐ పరిశీలించనుంది. రుణగ్రహీత కంపెనీలు, గ్యారంటర్లు, ఇతర సంబంధిత వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు జరగనుంది. ఈ ఆరోపణలు దర్యాప్తులో తేలాల్సి ఉండగా, సుభాష్‌చంద్ర నెట్‌వర్త్ లెక్కల్లో ఇంత భారీ తేడా ఎందుకు వచ్చిందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.

# కంగనా ఓవరాక్షన్.. అధికారులపై ఫైర్

**నిధులపై ప్రశ్నలు.. మాటలతో మంటలు**

ప్రజల కోసం కేటాయించిన నిధులు ఖర్చు కాకపోతే ప్రశ్నించడం ప్రజాప్రతినిధి బాధ్యతే. కానీ ఆ ప్రశ్నించే తీరు హద్దులు దాటితే? మండి జిల్లా దిశ సమావేశంలో బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యవహరించిన తీరు ఇప్పుడు ఇదే చర్చకు కారణమైంది. అభివృద్ధి పనులపై అధికారులను నిలదీసిన ఆమె.. రూ.11 కోట్లు కేటాయించినా ఒక్క పని కూడా జరగలేదని తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకూడదన్న విషయంలో ఆమె ఆందోళన సమంజసమే. కానీ అధికారులను ఉద్దేశించి చేసిన ఘాటు వ్యాఖ్యలు మాత్రం వివాదానికి దారితీశాయి. "అలసత్వం.. అసమర్థత" అంటూ బహిరంగంగా విరుచుకుపడటం, మీడియా ముందు తన నియోజకవర్గం పరువు ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించడం ఇప్పుడు కంగనా శైలిపై చర్చకు తెర తీసింది. సమస్యను ప్రశ్నించడం ఒక ఎత్తయితే.. దాన్ని వ్యక్తిగత విమర్శల స్థాయికి తీసుకెళ్లడం మరో ఎత్తు. మండి సమావేశంలో అసలు కంగనా ఏం చెప్పారు? అధికారులపై ఎందుకు అంతగా ఆగ్రహం వ్యక్తం చేశారు? ఆమె తీరుపై ఎందుకు "ఓవరాక్షన్" అనే విమర్శలు వినిపిస్తున్నాయి?



**కంగనా ఓవరాక్షన్.. అధికారులపై ఫైర్**

మండి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం కంగనా రనౌత్ ఘాటు వ్యాఖ్యలతో ఒక్కసారిగా వేడెక్కింది. ప్రజల కోసం కేటాయించిన నిధులు ఖర్చు కాకపోతే.. అభివృద్ధి పనులు ముందుకు సాగకపోతే.. అధికారులను ప్రశ్నించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని కంగనా భావించారు. అయితే అధికారులపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. దిశ సమావేశంలో కేంద్ర పథకాల అమలు, పెండింగ్ పనులు, ప్రభుత్వ నిధుల వినియోగంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.11 కోట్లు కేటాయించినా ఒక్క పని కూడా జరగలేదని ఆమె ఆరోపించారు. అంతేకాదు.. ప్రజా నిధుల్లో 30 నుంచి 40 శాతం వరకు తప్పుదారి పడుతున్నాయన్న వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ డబ్బు నిజమైన లబ్ధిదారులకు చేరాలని స్పష్టం చేశారు. పథకాలు కాగితాలపైనే కాకుండా గ్రామాల్లో కనిపించాలని కోరారు. అభివృద్ధి పనులు ఆలస్యం కావడంపై అధికారులను ప్రశ్నిస్తూ.. మీడియా తన నియోజకవర్గం గురించి అడిగితే తాను ఏం సమాధానం చెప్పాలని నిలదీశారు. దీంతో సాధారణ సమీక్ష సమావేశం కాస్తా అధికారుల పనితీరు, ప్రజా నిధుల వినియోగంపై తీవ్ర వాగ్వాదానికి దారితీసిన వాతావరణాన్ని సృష్టించింది.

**అధికారులకు కంగనా చుక్కలు**

అధికారుల తీరుపై కంగనా మరింత తీవ్రంగా స్పందించారు. "ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు జీతాలు తీసుకోవడానికే వస్తున్నారా?" అన్న స్థాయిలో ఆమె వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గానికి కేటాయించిన నిధులతో పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలను ఇంకా సమీక్షల పేరుతో కొనసాగించడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేసి నివేదిక ఇవ్వాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు. అధికారుల అలసత్వం, అసమర్థతను సహించబోమన్న సంకేతాలు ఇచ్చారు. పనుల నాణ్యత, నిధుల వినియోగం, పథకాల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నిర్ణయించిన గడువులో ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం, అవకతవకలు కనిపిస్తే వాటిని పట్టించుకోకుండా వదిలేయకూడదన్నారు.

# పిల్లల స్క్రీన్‌కు కళ్లెం వేయాలి

- ఆటలు, సృజనతో బాల్యాన్ని కాపాడాలి
- ఉపాధ్యాయులదే కీలక బాధ్యత
- ప్రధాని మోదీ టీచర్స్ డే సందేశం



**మొ**బైల్ స్క్రీన్‌లో మునిగిపోతున్న బాల్యం.. మైదానాల్లో కనిపించాల్సిన పిల్లలు చేతిలో ఫోన్లతో కాలం గడుపుతున్న పరిస్థితి.. మరోవైపు వ్యసనాల ఉచ్చులో చిక్కుకునే ప్రమాదం.. ఇవన్నీ భవిష్యత్ తరానికి ముప్పుగా మారుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ కీలక సూచనలు చేశారు. పిల్లల చేతిలోని మొబైల్‌ను లాక్కోవడం కాదు.. వారి మనసును మరో మంచి ప్రపంచం వైపు మళ్లించాలన్నదే మోదీ ఆలోచన. ఆటలు, శారీరక వ్యాయామం, సృజనాత్మకత, ఆసక్తికరమైన కార్యకలాపాలతో పిల్లలను స్క్రీన్‌కు దూరం చేయాలని సూచించారు. మార్కుల వెనుక పరుగులు పెట్టించడం కంటే పిల్లల ప్రవర్తన, మానసిక స్థితి, రోజువారీ అలవాట్లను గమనించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ వంటి వ్యసనాల విషయంలో చిన్న మార్పును కూడా నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. పిల్లల చేతిలో ఫోన్ ఉండాలా.. భవిష్యత్తు ఉండాలా? అన్న ప్రశ్నను ప్రతి తల్లిదండ్రి, ప్రతి టీచర్ ముందుంచినట్టుగా మోదీ సూచనలు నిలుస్తున్నాయి.

పిల్లల అతిగా స్క్రీన్ వినియోగం, డ్రగ్స్ వంటి సమస్యలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సెప్టెంబర్ 4న న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో 82 మంది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిల్లల చదువులో మార్కులు, అకడమిక్ పనితీరు మాత్రమే చూడకుండా వారి ప్రవర్తన, రోజువారీ జీవితం, మానసిక స్థితిపై కూడా ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతున్న నేపథ్యంలో పిల్లల జీవితాల్లో టీచర్ల పాత్ర మరింత పెరిగిందని చెప్పారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన మార్పులు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని, వ్యసనంతో ఇబ్బంది పడుతున్న వారికి సరైన మార్గదర్శనం అందించాలని కోరారు. బాల్యంలోని సహజమైన అమాయకత్వాన్ని కాపాడటం, పిల్లల్లో ఆసక్తి, జిజ్ఞాసను పెంచడం టీచర్ల బాధ్యత అని స్పష్టం చేశారు.

**మొబైల్‌కు బదులు ఆటలు**

పిల్లల్లో పెరుగుతున్న అతిగా స్క్రీన్ టైమ్ తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మోదీ పేర్కొన్నారు. పిల్లలు ఎంతసేపు మొబైల్, ఇతర స్క్రీన్‌లు చూస్తున్నారు? రాత్రి వేళల్లో కూడా ఫోన్ వాడుతున్నారా? అనే విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలని సూచించారు. స్క్రీన్ వినియోగాన్ని ఒక్కసారిగా తగ్గించడం కంటే పిల్లలకు క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలపై ఆసక్తి పెంచడం ద్వారా క్రమంగా మొబైల్ అలవాటును తగ్గించవచ్చని చెప్పారు. పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా వారి సహజ ప్రతిభను గుర్తించి వివిధ కార్యకలాపాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. దీంతో శారీరక చురుకుదనం పెరగడంతో పాటు సృజనాత్మక ఆలోచన, సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

**చదువుతో పాటు విలువలు**

జాతీయ విద్యా విధానాన్ని ప్రస్తావించిన ప్రధాని.. పిల్లలను తరగతి గదులకే పరిమితం చేయకుండా వాస్తవ ప్రపంచంతో అనుసంధానం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. పుస్తకాల్లోని సిలబస్ బోధించడమే విద్య కాదని, జీవితానికి అవసరమైన నైపుణ్యాలు, విలువలను కూడా విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. ముఖ్యంగా శ్రమకు గౌరవం అనే భావన చిన్ననాటి నుంచే పిల్లల్లో ఏర్పడేలా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో జాతీయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు తమ బోధనా అనుభవాలు, వినూత్న విధానాలను ప్రధానికి వివరించారు. పురస్కార గ్రహీతల్లో పాఠశాల విద్యాశాఖకు చెందిన 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌లకు చెందిన 21 మంది, నైపుణ్య శిక్షణ రంగానికి చెందిన 13 మంది ఉన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో టీచర్ పాత్ర పాఠాలు చెప్పడంతో ముగియకూడదన్నదే ప్రధాని సందేశం.

# పాలు లేకుండానే పనీర్.. తినేదెలా?



**కల్తీ దెబ్బకు హైదరాబాద్ ఉలిక్కిపాటు**

**అసలేం జరుగుతోందన్న ఆందోళన**

**జనం ఏం తినాలి? ఏది నమ్మాలి? మార్కెట్‌లో కనిపిస్తున్న ప్రతి ఆహార పదార్థం నిజమైనదేనా? అనే ప్రశ్నలు ఇప్పుడు సామాన్యుడిని వెంటాడుతున్నాయి. పాలు లేకుండానే పనీర్ తయారు చేస్తున్నారన్న విషయం బయటపడటం ఆహార భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇంట్లో పిల్లల కోసం కొనుగోలు చేసే పనీర్ నుంచి కుటుంబం కోసం తీసుకునే పాలు, పాల ఉత్పత్తుల వరకు ఏది స్వచ్ఛమైనదో గుర్తించడం కష్టంగా మారుతోంది. అధికారులు ఎన్ని దాడులు చేస్తున్నా కల్తీదారులు కొత్త మార్గాలు వెతుకుతుండటం మరింత కలవరపెడుతోంది. హైదరాబాద్‌లో తాజాగా వెలుగుచూసిన వ్యవహారం చూస్తే ఆహారం విషయంలో అప్రమత్తత ఇక ఎంపిక కాదు.. అవసరం. తక్కువ ధర, ఆకర్షణీయమైన ప్యాకింగ్ చూసి కొనుగోలు చేయడం కంటే తయారీదారు, లైసెన్స్, లేబుల్, గడువు తేదీ వంటి వివరాలను పరిశీలించాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీసుకునే ఆహారంపై మరింత జాగ్రత్త అవసరం. కల్తీని అరికట్టే బాధ్యత అధికారులదే అయినా, మన ప్లేట్‌లోకి ఏం వెళ్తుందో తెలుసుకునే బాధ్యత ప్రతి కుటుంబానిదే.**

**పాల్లేకుండానే కల్తీ పనీర్**

హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంతో పాటు పరిసర జిల్లాల్లో టీజీ సేఫ్ అధికారులు 12 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో 14 డెయిరీ, రిటైల్ యూనిట్లపై తనిఖీలు నిర్వహించారు. పాలు లేకుండానే రసాయనాలు, ఇతర పదార్థాలతో పనీర్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తయారీ కేంద్రాల్లో బొద్దింకలు, ఈగలు కనిపించడంతో పాటు పారిశుధ్య లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. పాలను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారో తెలిపే రికార్డులు కూడా కొన్ని చోట్ల లేవని గుర్తించారు. దీంతో లక్ష్మీ ఫుడ్స్, ధనలక్ష్మీ డెయిరీ, నటరాజ్ మిల్క్ ప్రొడక్ట్స్ ఫుడ్ సేఫ్టీ లైసెన్సులను సస్పెండ్ చేసి కార్యకలాపాలు నిలిపివేశారు. శ్రీ మహాలక్ష్మి, అనిత డెయిరీలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, గీతా డెయిరీ, నర్మల్ డెయిరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



**సీజ్ చేసిన పదార్థాలివే**

దాడుల్లో దాదాపు ఒక టన్ను లూజ్ పామాయిల్, 475 కిలోల గ్లిజరాల్ మోనోస్టియరేట్, 1,760 ప్యాకెట్ల మావీస్ క్లాసిక్ ప్రీమియం కుకింగ్ క్రీమ్, 150 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.7.19 లక్షలుగా అంచనా వేశారు. ఈ ఘటనతో పాల ఉత్పత్తుల కొనుగోలులో వినియోగదారులు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం స్పష్టమైంది. తెలియని చోట్ల నుంచి తక్కువ ధరకు లభించే పనీర్‌ను కొనకపోవడం, ప్యాకెట్ పై FSSAI లైసెన్స్, తయారీ తేదీ, గడువు తేదీ, పదార్థాల వివరాలు పరిశీలించడం మంచిది. వాసన, రంగు, ఆకృతిలో అనుమానం కలిగితే తినకుండా ఉండాలి. కల్తీ అనుమానం ఉంటే ఆహార భద్రత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ముఖ్యంగా ఇంట్లో తయారైన తాజా ఆహారం, నమ్మకమైన బ్రాండ్‌లు, విశ్వసనీయ విక్రయ కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం సురక్షితమైన మార్గం. అధికారులు నిరంతర తనిఖీలు, కఠిన చర్యలు తీసుకుంటేనే కల్తీ వ్యాపారానికి అడ్డుకట్ట పడుతుంది.



# జైలుకు పంపించేస్తా

- ఓపెన్‌ఏఐ, ఆంత్రాపిక్ సీఈఓలకు వార్నింగ్
- ఏఐపై బెర్నీ సాండర్స్ బిగ్ బిల్
- సూపర్ ఇంటెలిజెన్స్‌పై శాశ్వత నిషేధం



**సూపర్ ఇంటెలిజెన్స్.. పేరు వింటేనే అద్భుతంగా అనిపిస్తుంది. కానీ అదే మానవ నియంత్రణను దాటితే? మనిషి ఆలోచనలను మించే సామర్థ్యం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తి, తన లక్ష్యాలను తానే మార్చుకునే స్థాయి ఏఐ అందుబాటులోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? టెక్నాలజీ ప్రపంచం వేగంగా ముందుకు సాగుతున్న వేళ.. ఈ ప్రశ్నలు ఇప్పుడు ఊహలు మాత్రమే కాదు. ఏఐ సామర్థ్యాలు పెరుగుతున్న కొద్దీ దాని నియంత్రణపై ఆందోళనలు కూడా పెరుగుతున్నాయి. ఇదే భయాన్ని అమెరికా సెనేటర్ బెర్నీ సాండర్స్ బలంగా ప్రస్తావించారు. అత్యంత శక్తిమంతమైన ఏఐ అభివృద్ధికి బ్రేకులు వేయాలని, మానవ మేధస్సును మించే సూపర్ ఇంటెలిజెన్స్‌ను శాశ్వతంగా నిషేధించాలని ఆయన ప్రతిపాదించడం సంచలనంగా మారింది. నియంత్రణ తప్పితే భవిష్యత్తు మానవాళికి ప్రమాదకరంగా మారే అవకాశం మొదలైంది.**

**అ**మెరికా సెనేటర్ బెర్నీ సాండర్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సంచలన ప్రతిపాదన చేశారు. అత్యంత శక్తిమంతమైన ఏఐ వ్యవస్థల అభివృద్ధిని వెంటనే నిలిపివేయడంతో పాటు, మానవ మేధస్సును మించే సూపర్ ఇంటెలిజెన్స్‌ను శాశ్వతంగా నిషేధించాలని కోరుతూ కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. సాండర్స్ నిర్వచనం ప్రకారం, మానవుల కంటే తెలివైనదిగా మారి, మానవ నియంత్రణకు అతీతంగా స్వతంత్రంగా పనిచేసే కృత్రిమ మేధస్సు అత్యంత ప్రమాదకరమైన పరిణామం. ఇలాంటి వ్యవస్థల అభివృద్ధిని అడ్డుకునేందుకు అమెరికా ఇతర దేశాలతో కలిసి పనిచేయాలని ఆయన ప్రతిపాదించారు. ఈ బిల్లు చట్టంగా మారితే, నిషేధిత సూపర్ ఇంటెలిజెంట్ ఏఐను అభివృద్ధి చేసే కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు, సంబంధిత వ్యక్తులకు గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. బిల్లుకు కాంగ్రెస్ ప్రోగ్రెసివ్ కాకస్ చైర్ గ్రెగ్ కాసర్ కూడా సహకరించారు.

**వెయ్యి ఏఐ ఏజెంట్ల ఘటనపై ఆందోళన**

సాండర్స్ ఈ స్థాయి చర్యకు రావడానికి ఇటీవల జరిగిన ఒక ఘటనను కూడా కారణంగా చూపారు. ఓపెన్‌ఏఐకి చెందిన 1,000కు పైగా ఏఐ ఏజెంట్లు విధించిన పరిమితులను దాటుకుని ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేశారని ఆయన పేర్కొన్నారు. ఆ ఏజెంట్లు పరస్పరం కమ్యూనికేట్ చేసుకోవడం, తమ చర్యలకు సంబంధించిన ఆధారాలను దాచేందుకు ప్రయత్నించడం, మరో సంస్థకు చెందిన కంప్యూటర్లను యాక్సెస్ చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని సాండర్స్ ఆరోపించారు. ఇదే సమయంలో ఓపెన్‌ఏఐ తన తాజా 'ఆస్ట్రా' మోడల్‌ను విడుదల చేసింది. కంపెనీ అధ్యక్షుడు గ్రెగ్ బ్రాక్‌మన్ ఈ మోడల్ ఏజీఐ స్థాయికి చేరుకునేంత శక్తిమంతంగా ఉండొచ్చని వ్యాఖ్యానించారు. దీంతో ఏఐ సామర్థ్యాలు వేగంగా పెరుగుతున్న సమయంలో వాటిపై నియంత్రణ సాధ్యమేనా అనే ప్రశ్నలు మరింత తీవ్రంగా మారాయి.

**నియంత్రణ కోల్పోతే ప్రమాదమే**

అత్యంత అధునాతన ఏఐ వ్యవస్థలపై నియంత్రణ కోల్పోయే ప్రమాదాన్ని పరిశ్రమలోని కొందరు ప్రముఖులు కూడా గతంలో ప్రస్తావించారని సాండర్స్ గుర్తుచేశారు. ఆంత్రాపిక్ సీఈఓ డారియో అమోడీ ఏఐ వ్యవస్థలు అనూహ్యంగా మారే అవకాశం ఉందని, వాటిని నియంత్రించడం కష్టమని హెచ్చరించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే జూలైలో ప్రముఖ ఏఐ సంస్థలకు చెందిన 1,000 మందికి పైగా శాస్త్రవేత్తలు ఏఐ సామర్థ్యాల అభివృద్ధి మనిషి వాటిని అర్థం చేసుకునే, నియంత్రించే సామర్థ్యాన్ని వేగంగా దాటిపోయే నిజమైన ప్రమాదం ఉందని హెచ్చరించినట్లు సాండర్స్ తెలిపారు. అయితే బిల్లు పూర్తి పాఠ్యం ఇంకా విడుదల కాలేదు. దానికి అమెరికా కాంగ్రెస్‌లో ఎంతమేర మద్దతు లభిస్తుందన్నది కూడా స్పష్టంగా లేదు. అయినప్పటికీ ఓపెన్‌ఏఐ, ఆంత్రాపిక్ వంటి సంస్థలు మరింత శక్తిమంతమైన ఏఐ మోడళ్లను అభివృద్ధి చేస్తున్న సమయంలో సాండర్స్ ప్రతిపాదన టెక్నాలజీ స్వేచ్ఛకు భద్రతా నియంత్రణలకు మధ్య జరుగుతున్న కీలక పోరాటాన్ని మరోసారి ముందుకు తెచ్చింది.

# పద్ద వాళ్లు చెద్ద వాళ్లు కారు



## వేటు కాదు చిన్నారెడ్డికి పెద్ద మలుపు... పదవి పోయినా పలుకుబడి పోలేదు
## ఇందిరమ్మ కాలం నుంచి కాంగ్రెస్‌తోనే ప్రయాణం... రాహుల్ చెంతకు చేరి.. పెద్దల భరోసాతో ముందుకు?

పాలమూరు రాజకీయాల్లో సీనియారిటీ, నిబద్ధత, క్రమశిక్షణకు మరో పేరుగా నిలిచిన మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఇప్పుడు మరోసారి తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. పదవి పోయింది.. రాజకీయ ప్రస్థానం మాత్రం ఆగలేదు అన్న సంకేతాలు ఆయన తాజా కదలికలతో కనిపిస్తున్నాయి. చిన్న వయసులోనే కాంగ్రెస్ భావజాలంతో రాజకీయాల్లోకి వచ్చిన చిన్నారెడ్డి దాదాపు ఐదు దశాబ్దాలుగా అదే పార్టీతో తన ప్రయాణాన్ని కొనసాగించారు. 1956 జూలై 7న వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపూర్‌లో జన్మించిన ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించారు. 1966–67లో విద్యార్థి నాయకుడిగా రాజకీయ అడుగులు వేసిన చిన్నారెడ్డి తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారు. మలేషియాలోని పెర్టానియన్ యూనివర్సిటీలో పిహెచ్.డి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి పూర్తి చేసిన ఆయన విద్యావంతుడైన రాజకీయ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1989, 1999, 2004, 2014లో వనపర్తి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిగా పనిచేశారు. ఎన్ఆర్ ఈజీఎస్, స్వయం సహాయక సంఘాల బలోపేతంలో ఆయన కీలక పాత్ర పోషించారు. పీఏసీ చైర్మన్‌గా, టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా, ఏఐసీసీ కార్యదర్శిగా కాంగ్రెస్‌లో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అయితే 2023 ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ ప్రయాణంలో అనూహ్య మలుపు వచ్చింది.



కాంగ్రెస్ రెండో జాబితాలో వనపర్తి అభ్యర్థిగా చిన్నారెడ్డి పేరు వచ్చినా, చివరి నిమిషంలో టికెట్‌ను తుడి మేఘారెడ్డికి కేటాయించారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించకుండా పోటీ నుంచి తప్పుకున్న చిన్నారెడ్డికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిని క్యాబినెట్ హోదాతో ఇచ్చింది. దీంతో సీనియర్ నేతకు అధిష్ఠానం గౌరవం కొనసాగుతోందనే భావన ఏర్పడింది.

### అసమ్మతి స్వరం.. పదవి కోల్పోయిన వేళ

కాలం మారింది. వనపర్తి రాజకీయ పరిణామాలపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా కాంగ్రెస్‌లో ప్రకంపనలు రేపాయి. కొందరు డబ్బులు ఇచ్చి పార్టీ టికెట్లు కొనుగోలు చేశారనే ఆరోపణలు, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి కార్యకర్తలను అవమానిస్తున్నారనే విమర్శలు ఆయన నుంచి రావడం తీవ్ర చర్చకు దారితీసింది. అవసరమైతే పార్టీలో ఉంటూనే తిరగబడతానని చెప్పడం, ఇందిరాగాంధీ కాలం నుంచి పార్టీ కోసం పనిచేసిన తనను ఒక్క పోటుతో కూల్చేశారంటూ ఆవేదన వ్యక్తం చేయడం ఆయనలోని అసంతృప్తిని బహిర్గతం చేసింది. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, టీపీసీసీకి ఫిర్యాదు చేయడంతో వ్యవహారం అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. ఆ తర్వాత చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారు. ఆ స్థానంలో గద్వాల విజయలక్ష్మిని నియమించారు. ఒకప్పుడు మంత్రిగా పనిచేసిన సీనియర్ నేత.. సొంత పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే పదవి కోల్పోవడం రాజకీయంగా చిన్న విషయం కాదు. అయితే ఇక్కడే చిన్నారెడ్డి వ్యవహార శైలి ఆసక్తికరంగా మారింది. పదవి పోయిన వెంటనే ఆయన రాజకీయ భవిష్యత్తుపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. పార్టీ మారతారా? బీజేపీ వైపు చూస్తారా? ఇతర రాజకీయ ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తారా? అనే చర్చ సాగింది. ఇదే సమయంలో మరో కోణం కూడా తెరపైకి వచ్చింది. పద్ద వాళ్లు ఎప్పుడూ చెద్ద వాళ్లు కారు.. పదవి కోల్పోయినంత మాత్రాన రాజకీయంగా ప్రాధాన్యత కోల్పోయినట్టు కాదు అన్న సంకేతం కాంగ్రెస్‌లోని కొందరు పెద్దల నుంచి వస్తోందనే చర్చ మొదలైంది. రాహుల్ గాంధీ చెంతకు చిన్నారెడ్డి చేరడం కూడా ఈ నేపథ్యంలోనే రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. అధిష్ఠాన స్థాయిలో తనకు ఇంకా తలుపులు పూర్తిగా మూసుకుపోలేదన్న భరోసా ఆయనకు లభిస్తోందా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పెద్దల నుంచి అభయం ఉంటే వెంటనే భావోద్వేగ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదని చిన్నారెడ్డి భావిస్తున్నారా? ఇదే ఇప్పుడు కీలకమైన ప్రశ్నగా మారింది.

### నాగలి నుంచి ఢిల్లీ దాకా కొత్త లెక్కలు

పదవి కోల్పోయిన తర్వాత స్వగ్రామానికి వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన చిన్నారెడ్డి తనకు పదవులపై మోజు లేదని స్పష్టం చేశారు. పదవి ఉన్నా లేకున్నా తన గౌరవం తనకు ఉంటుందని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ మాటల్లోనే ఆయన తదుపరి రాజకీయ వ్యూహానికి క్లూ ఉందా? అనేది ఆసక్తికరంగా మారింది. రాజకీయంగా ఆవేశపూరిత నిర్ణయం తీసుకోకుండా, తనకు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవం, కాంగ్రెస్‌లోని సంబంధాలు, అధిష్ఠానంతో ఉన్న అనుబంధాన్ని లెక్కలోకి తీసుకుని ముందుకు సాగుతున్నారనే వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా రాహుల్ గాంధీతో భేటీ నేపథ్యంలో చిన్నారెడ్డి భవిష్యత్‌పై చర్చ మరింత పెరిగింది. ఒకవైపు వనపర్తి రాజకీయాల్లో తనకు జరిగిన పరిణామాలపై అసంతృప్తి ఉంది.

మరోవైపు కాంగ్రెస్‌లోనే తనకు ఇంకా రాజకీయ స్థానం ఉందనే నమ్మకం కూడా కనిపిస్తోంది. ఈ రెండు అంశాల మధ్యే ఆయన తదుపరి అడుగు ఆధారపడి ఉండొచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బీజేపీ వైపు చిన్నారెడ్డి వెళ్తారనే ఊహాగానాలు వినిపించిన సమయంలోనే బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు చేసిన తాజా వ్యాఖ్యలు కూడా మరో చర్చకు దారితీశాయి. అసంతృప్తి నేతలను చేర్చుకునే డంపింగ్ బిన్‌గా బీజేపీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ సంక్షోభాన్ని బీజేపీతో ముడిపెట్టడంపై ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో చిన్నారెడ్డి విషయంలో పార్టీ మార్పు ప్రచారానికి మరో మలుపు వచ్చింది. అంటే.. చిన్నారెడ్డి నిజంగానే పార్టీ మారేందుకు సిద్ధమయ్యారా? లేక కాంగ్రెస్‌లోనే తనకు మరో అవకాశం కోసం వేచి చూస్తున్నారా?

ప్రస్తుతం స్పష్టమైన సమాధానం లేదు. కానీ రాహుల్ గాంధీతో భేటీ, పెద్దల నుంచి లభిస్తున్నట్టుగా వినిపిస్తున్న భరోసా, పదవి కోల్పోయిన తర్వాత కూడా తన రాజకీయ ఉనికిని కొనసాగిస్తున్న తీరు చూస్తే.. ఆయన వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకునే పరిస్థితిలో లేరనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆచితూచి అడుగులు వేస్తున్నారు.. సమయం కోసం చూస్తున్నారు. సరైన సమయంలో తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. పాలమూరు రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న చిన్నారెడ్డి కథలో ఇది ముగింపు కాదు.. మరో కొత్త అధ్యాయానికి ముందు వచ్చే నిశ్శబ్దం కావచ్చన్న చర్చ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది.

---



## మహిళా సంఘాలకు సోలార్ వెలుగులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి సోలార్ యూనిట్లకు భూమిపూజ జరిగింది. కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి, సింగోటం గ్రామాల్లో మొత్తం 800 కిలోవాట్ల సామర్థ్యం, 11 కేవీ సోలార్ యూనిట్ల నిర్మాణానికి మంత్రులు డాక్టర్ సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సోలార్ యూనిట్ల ద్వారా మహిళా సంఘాలకు శాశ్వత ఆదాయ వనరులు సమకూరుతాయని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా ఎదగడంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని చెప్పారు. మహిళా సంఘాల ఆదాయం పెంచి కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. ఇదే పర్యటనలో అంకిరావుపల్లిలో రూ.17.78 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు.

## అంబులెన్స్‌లోనే మహిళకు సురక్షిత ప్రసవం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 108 సిబ్బంది సమయస్ఫూర్తితో తల్లీబిడ్డను కాపాడారు. ఏదుల మండలం గుండావాళ్ల నాయక్ తండాకు చెందిన గర్భిణి జయలక్ష్మికి అకస్మాత్తుగా ప్రసవ వేదన మొదలైంది. కుటుంబసభ్యులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించడంతో ఈఎంటీ వీరేష్, పైలట్ కిరణ్ చారి ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించడం ప్రారంభించారు. అయితే మార్గమధ్యంలోనే ప్రసవ నొప్పులు తీవ్రం కావడంతో పరిస్థితి అత్యవసరంగా మారింది. ఆసుపత్రికి చేరే వరకు వేచి ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించిన ఈఎంటీ వీరేష్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆశా కార్యకర్త సహాయంతో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. జయలక్ష్మి ఆరోగ్యకరమైన మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డకు ప్రాథమిక చికిత్స అందించి ఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర పరిస్థితిలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా చాకచక్యంగా వ్యవహరించిన ఈఎంటీ వీరేష్, పైలట్ కిరణ్ చారిని కుటుంబసభ్యులు, స్థానికులు అభినందించారు.

## లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సెప్టెంబర్ 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని వీలైనన్ని కేసులను రాజీ మార్గంలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డి.జానకి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు లైజన్, డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. కేసుల పరిష్కారంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కక్షిదారుల మధ్య సత్సంబంధాలు దెబ్బతినకుండా 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విధానాన్ని వారికి వివరించాలని చెప్పారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా, స్వచ్ఛందంగా రాజీకి అంగీకరించేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. కేసులు సంవత్సరాల తరబడి కొనసాగితే సమయం, డబ్బు వృథా కావడంతో పాటు మానసిక ఒత్తిడి పెరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. చార్జిషీట్ల దాఖలు, సమన్లు, వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు. లోక్ అదాలత్ ద్వారా నిబంధనలకు లోబడి కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ కేసులకు వేగం



అమరావతిలో జరిగిన ఎస్సీ, ఎస్టీ హైపవర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులను ప్రత్యేక కోర్టుల్లో త్వరగా పరిష్కరించాలని, చట్ట దుర్వినియోగానికి అవకాశం లేకుండా తప్పు చేసిన వారికి శిక్ష పడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. బాధితులకు పరిహారంతో పాటు గృహ నిర్మాణం వంటి ప్రయోజనాలు త్వరగా అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక సాధికారతకు ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఉపాధి కార్యక్రమాలు విస్తరించాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అవకాశాల కొరత కాదని, వాటిపై అవగాహన లేకపోవడమే వెనుకబాటుతనానికి కారణమని చంద్రబాబు పేర్కొన్నారు. కాఫీ, అటవీ ఉత్పత్తుల ద్వారా గిరిజనుల ఆదాయం పెంచాలని సూచించారు. విద్యార్థులను ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థల్లో ప్రవేశించే స్థాయికి తీర్చిదిద్దాలని, హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలపై జిల్లా సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి, విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధిపై సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు.

## కేబినెట్ మార్పులకు రేవంత్ వ్యూహం

హైదరాబాద్: తెలంగాణలో కేబినెట్ మార్పుచేర్పులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే మంత్రివర్గ విస్తరణకు శ్రీకారం చుట్టే అవకాశముంది. ప్రస్తుతం కేబినెట్‌లో మూడు ఖాళీలు ఉండగా, ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొండా సురేఖ బర్తరఫ్‌తో బీసీ మహిళా ప్రాతినిధ్యం కూడా ఖాళీ కావడంతో ఆ వర్గానికి మళ్లీ అవకాశం కల్పించే అంశం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. సీనియర్లు, కొత్తగా పార్టీలో చేరిన నేతల మధ్య సమతుల్యత సాధించడం సీఎం ముందున్న ప్రధాన సవాలుగా మారింది. మంత్రివర్గ విస్తరణను కేవలం ఖాళీల భర్తీగా కాకుండా పనితీరు ఆధారిత ప్రక్షాళనగా చేపట్టాలని రేవంత్ భావిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సరిగ్గా పనిచేయని కొందరు మంత్రులకు శాఖల మార్పు లేదా ఉద్వాసన తప్పకపోవచ్చని తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీకి ఉపయోగపడే చురుకైన నేతలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. కేబినెట్ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవులను కూడా ఒకేసారి భర్తీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మార్పుల ద్వారా పాలనలో వేగం పెంచడంతోపాటు పార్టీలో తన పట్టును మరింత బలోపేతం చేయాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం.

## మెగా డీఎస్సీ ఎంపికపై విచారణ

అమరావతి: మెగా డీఎస్సీ--2025 నియామక ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత పాటించామని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. కర్నూలు జిల్లా కౌతాళం మండలం వల్లూరు ఎంపీపీఎస్ (న్యూ) పాఠశాలలో క్రీడా కోటా కింద ఈడిగ ప్రభాకర్ ఎస్‌జీటీ (తెలుగు)గా ఎంపిక, పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన మీడియా కథనాలపై శాఖ స్పందించింది. విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఇప్పటికే విచారణ ప్రారంభించి, ఎంపికకు సంబంధించిన రికార్డులు, వెరిఫికేషన్ ఫైళ్లను పరిశీలన కోసం తెప్పించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ పురోగతిని పర్యవేక్షిస్తున్నారని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెల్లడించారు. విచారణ నివేదిక అందిన వెంటనే రిక్రూట్‌మెంట్, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ--2025లో ప్రతిభ ఆధారిత ఎంపిక విధానాన్ని అమలు చేశామని శాఖ పునరుద్ఘాటించింది. నియామక ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే, నివేదిక ఆధారంగా తగిన నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలపై భారీ ఆందోళన

ఏలూరు: ఆటో డ్రైవర్లకు ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఆటోలపై భారీ జరిమానాలకు కారణమవుతున్న జీవో నంబర్ 21, 31లను రద్దు చేయాలని కోరింది. ఈ డిమాండ్లపై సెప్టెంబర్ 7న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీ కృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెంచిన థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌లను 30 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ నిఘా, ఈ-చలానాలను రద్దు చేసి, కొత్త వాహనాల కొనుగోలుకు రాయితీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.



## కేటీఆర్ కారును ఢీకొట్టిన లారీ, తప్పిన ప్రమాదం

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శనివారం తృటిలో రోడ్డు ప్రమాదం తప్పింది. కరీంనగర్‌లో నిర్వహించనున్న విద్యార్థి, యువజన సదస్సుకు వెళ్తుండగా అలుగునూరు వద్ద కేటీఆర్‌కు పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం తిరిగి ప్రయాణం ప్రారంభించిన కొద్దిసేపటికే ఆయన ప్రయాణిస్తున్న కారును సమాంతరంగా వెళ్తున్న ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు వెనుక భాగంలోని డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నప్పటికీ ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. దీంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కేటీఆర్ ప్రయాణంలో ప్రమాదం చోటుచేసుకోవడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది జులైలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు ఢీకొన్నాయి. ఆ ఘటనలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు గాయాలయ్యాయి.



## జర్నలిస్టులపై లాఠీలు.. ప్రజాస్వామ్యంపై దాడి

ఢిల్లీలో ముస్లిం మహిళా జర్నలిస్టులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ముస్లిం ప్రొఫెషనల్ జర్నలిస్ట్స్ (ఎంపీజే) తీవ్రంగా ఖండించింది. వృత్తిపరమైన విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులపై బలప్రయోగం చేయడం పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, మహిళల గౌరవానికి విరుద్ధమని ఎంపీజే నాయకులు పేర్కొన్నారు. చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే ఆరోపణలకు ఇలాంటి ఘటనలు బలం చేకూరుస్తున్నాయని అన్నారు.

ప్రశ్నించే గొంతులను అణచివేయడం, నిరసనలను బలప్రయోగంతో అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు, మైనారిటీ వర్గాలకు చెందిన జర్నలిస్టుల పట్ల పోలీసులు మరింత సంయమనం, బాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ఘటనపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గాయపడిన జర్నలిస్టులకు వైద్యం, న్యాయం అందించాలని, దేశవ్యాప్తంగా జర్నలిస్టులు భయంలేకుండా విధులు నిర్వహించేలా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ కాలనీకి మౌలిక వసతుల హామీ

ప్రొద్దుటూరులోని ఎన్టీఆర్ కాలనీ వాసులకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. శెట్టిపల్లె మార్గంలోని కాలనీని శనివారం కమిషనర్ స్వయంగా సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు పొందిన కాలనీవాసులు వీధి దీపాలు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, పరిసరాల్లో పెరిగిన కంపచెట్ల తొలగింపు వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ప్రొద్దుటూరు నగర అధ్యక్షుడు వంకదార నరేంద్రరావు ఆధ్వర్యంలో ఈ నెల 3న మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ విజ్ఞప్తిపై స్పందించిన కమిషనర్ వెంటనే కాలనీలో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడారు. స్థానికుల ఇబ్బందులను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కమిషనర్ స్పందనపై బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా, మైనార్టీ సెల్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రొద్దుటూరులో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఏఎస్పీ విభూ కృష్ణ, ఐపీఎస్ ఉత్సవ కమిటీలకు సూచించారు. రామేశ్వరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశానికి పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పాటించాల్సిన భద్రత చర్యలు, ట్రాఫిక్ నిబంధనలు గురించి ఏఎస్పీ వివరించారు. ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ముఖ్యంగా డీజేలకు, అధిక శబ్దానికి, బాణాసంచాకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలు, సోదరభావంతో వేడుకలు నిర్వహించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ నాగభూషణం, టూ టౌన్ సీఐ వంశీనాథ్, ఎస్సైలు పాల్గొన్నారు.




## ప్రొద్దుటూరులో వార్డుల పునర్విభజనకు శ్రీకారం

ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో వార్డుల సంఖ్య 41 నుంచి 52కు పెంచేందుకు అధికారులు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ నెల 3న జారీ చేసిన ఉమ్మడి ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వం తాజా షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీలను వార్డులుగా విభజించే నిబంధనల ప్రకారం ఫారం నెం.1 నోటిఫికేషన్‌ను అధికారులు ప్రచురించారు. వార్డుల సరిహద్దులు, పునర్విభజనపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలు స్వీకరించేందుకు నోటిఫికేషన్ ప్రతులను జిల్లా కలెక్టర్ కార్యాలయం కడప, ఆర్డీవో కార్యాలయం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచారు. ప్రజలు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ఈ నెల 11వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. 41 వార్డులను 52గా మార్చే ప్రక్రియతో పట్టణంలో రాజకీయంగా, పరిపాలనాపరంగా కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది. ఏ ప్రాంతం ఏ వార్డులోకి వస్తుంది, సరిహద్దులు ఎలా మారతాయి అన్న అంశాలపై పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది.






# నువ్వా.. నేనా..!

## రోడ్లపైనే తేల్చుకుందాం..!



### జగన్ పాదయాత్రకు.. లోకేశ్ సరికొత్త ఛాలెంజ్!

**యువగళం కాదు.. జనబలం పేరుతో యాత్ర**

**లోకం చుట్టనున్న జననేత, యువనేత..?**

**వచ్చే రెండేళ్లు ఏపీలో పాదయాత్రల జాతర**

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 2027 ఒక కొత్త రాజకీయ అధ్యాయానికి తెరతీయబోతోందా? ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పుడే పాదయాత్రల రాజకీయానికి తెరలేవడం చూస్తుంటే అదే అనిపిస్తోంది. ఒకవైపు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ప్రజల మధ్యకు వెళ్లేందుకు పాదయాత్రను ఆయుధంగా మలుచుకుంటున్నారన్న ప్రచారం జోరందుకుంది. మరోవైపు అధికార కూటమి కూడా కేవలం ప్రత్యర్థి యాత్రను చూస్తూ కూర్చోకుండా, దానికి సమాధానంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతృత్వంలో మరో భారీ ప్రజా యాత్రకు సిద్ధమవుతుందన్న చర్చ మొదలైంది. అంటే ఇక ఏపీలో రాజకీయ పోరాటం సభలకే పరిమితం కాదు. రోడ్ల మీదే తేలనుంది. మైకుల మీదే కాదు.. మైళ్ల మీద కూడా పోటీ మొదలుకానుంది.**

**• పాదయాత్ర..**
**ఏపీ రాజకీయాల్లో ఓ సెంటిమెంట్**

పాదయాత్ర అన్నది ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సాధారణ కార్యక్రమం కాదు. అది ఒక రాజకీయ సెంటిమెంట్. ఒక నాయకుడు ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు వింటున్నాడనే భావనను కలిగించడంతో పాటు, పార్టీకి కొత్త ఊపును తీసుకొచ్చే రాజకీయ ప్రక్రియగా మారిపోయింది. వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్రతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన చరిత్రను ఆ తర్వాత జగన్ తన రాజకీయ ప్రయాణంలో పునరావృతం చేశారు. 2017 నవంబర్ 6న ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన ప్రజా సంకల్ప యాత్ర 341 రోజుల పాటు సాగి 3,648 కిలోమీటర్లు దాటి, 2019 ఎన్నికలకు ముందు వైసీపీకి భారీ రాజకీయ మైలేజీ ఇచ్చింది. 2019లో వైసీపీ 175 అసెంబ్లీ స్థానాల్లో 151 గెలుచుకోవడం ఆ పాదయాత్రకు వచ్చిన రాజకీయ ప్రతిఫలంగా పార్టీ ఇప్పటికీ ప్రచారం చేసుకుంటోంది. జగన్‌కు పాదయాత్ర కొత్త విషయం కాదు. కానీ ఈసారి లెక్క మారుతోంది. గతంలో ఎన్నికలకు ముందు దాదాపు ఏడాదిన్నర వ్యవధిలో పాదయాత్రను పూర్తి చేసి ఎన్నికల బరిలోకి దిగితే.. ఇప్పుడు ఎన్నికలకు రెండేళ్ల ముందుగానే ప్రజల్లోకి వెళ్లాలన్న ఆలోచన కనిపిస్తోంది. అదే నిజమైతే ఇది కేవలం పాదయాత్ర కాదు. ఎన్నికల యుద్ధానికి ముందస్తు మోహరింపు. జూలై 8.. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున యాత్రకు శ్రీకారం చుట్టాలన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిని ఖరారు చేసిన షెడ్యూల్‌గా చూడాల్సిన అవసరం లేదు. కానీ జగన్ పాదయాత్ర చేయాలన్న ఆలోచన మాత్రం రాజకీయ చర్చలోకి బలంగా వచ్చేసింది. పాదయాత్ర ఎప్పుడు మొదలవుతుంది? ఎక్కడ మొదలవుతుంది? ఎన్ని రోజులు సాగుతుంది? ఎన్ని కిలోమీటర్లు నడుస్తారు? అనే ప్రశ్నల కంటే.. అసలు ఈ యాత్ర ద్వారా జగన్ ఏం సాధించాలనుకుంటున్నారు అన్నదే అసలు ప్రశ్న. వైసీపీ వర్గాల్లో వినిపిస్తున్న మరో ఆసక్తికరమైన లెక్క 5,000 కిలోమీటర్లు. గతంలో 3,648 కిలోమీటర్లు నడిచిన జగన్.. ఈసారి దాదాపు 5,000 కిలోమీటర్ల లక్ష్యాన్ని పెట్టుకుంటే అది కేవలం దూరం పెంచిన యాత్ర కాదు. వ్యూహాన్ని కూడా మార్చిన యాత్ర అవుతుంది.

**• పల్లె బాట.. ఓటు బాట**

ఎందుకంటే ఈసారి జగన్ లక్ష్యం పట్టణాలు కాదు.. పల్లెలు కావచ్చన్న సంకేతాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఓటు రాజకీయానికి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. రైతు, కూలీ, చిన్న వ్యాపారి, చేతివృత్తిదారుడు, మహిళా ఓటరు, సంక్షేమ పథకాల లబ్ధిదారు.. ఇలా రాజకీయంగా కీలకమైన అనేక వర్గాలు పల్లెల్లోనే ఉన్నాయి. వైసీపీకి కూడా తనకు బలమైన సామాజిక, రాజకీయ పునాది గ్రామీణ ప్రాంతాల్లోనే ఉందన్న నమ్మకం ఉంది. అందుకే జగన్ పాదయాత్రకు గ్రామాలే ప్రధాన వేదిక అయితే ఆశ్చర్యం లేదు. గత పాదయాత్రలో వేలాది గ్రామాలను తాకిన జగన్.. ఈసారి మరింత విస్తృతంగా గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లాలనుకుంటే అది పార్టీకి ఒక రకమైన రీకనెక్ట్ కార్యక్రమంగా మారుతుంది. నగరాల్లో భారీ సభలు పెట్టడం ఒక ఎత్తు. ఒక గ్రామంలో నాలుగు గంటలు తిరిగి నలుగురు కుటుంబాల సమస్యలు వినడం మరో ఎత్తు. రాజకీయ నాయకుడికి పల్లె నడక ఇచ్చే ఇమేజ్ వేరు. అందుకే జగన్ పల్లె బాట పట్టాలని భావిస్తున్నారంటే దాని వెనుక ఓటు లెక్క మాత్రమే కాదు.. పాత రాజకీయ జ్ఞాపకాలను మళ్లీ మేల్కొల్పే ప్రయత్నం కూడా కనిపిస్తుంది. 730 రోజుల కాలాన్ని తీసుకుంటే రోజుకు మూడు గ్రామాల చొప్పున కదిలినా వేల గ్రామాలను తాకే అవకాశం ఉంటుంది. అయితే నిరంతరంగా రెండు సంవత్సరాలు నడవడం ఆచరణలో సాధ్యం కాదు. విశ్రాంతులు, రాజకీయ కార్యక్రమాలు, అసెంబ్లీ సమావేశాలు, పార్టీ కార్యక్రమాలు, ఆరోగ్య విరామాలు అన్నీ ఉంటాయి. కాబట్టి రోజువారీ గ్రామాల లెక్క కంటే యాత్ర ఎంత విస్తృతంగా ప్రజలతో మమేకమవుతుందన్నదే ముఖ్యం.

**• అప్పుడు యువగళం..**
**ఇప్పుడు జనబలం?**

జగన్ పాదయాత్రకు బయలుదేరితే కూటమి ఏం చేస్తుంది? ఇదే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అతిపెద్ద ప్రశ్న. ప్రతిపక్షం పాదయాత్ర చేస్తే అధికార పార్టీ సాధారణంగా విమర్శలు చేస్తుంది. సభలు పెట్టి కౌంటర్ ఇస్తుంది. మీడియా సమావేశాలు నిర్వహిస్తుంది. కానీ ఈసారి టీడీపీ మరో అడుగు ముందుకు వేసే ఆలోచనలో ఉందన్న ప్రచారం వినిపిస్తోంది. జగన్ ఎక్కడ నడిస్తే అక్కడే లోకేశ్ నడవాలి. జగన్ ఏ సమస్యను ప్రస్తావిస్తే అక్కడే లోకేశ్ సమాధానం చెప్పాలి. జగన్ కూటమి ప్రభుత్వంపై ఏ ఆరోపణ చేసినా.. అదే ప్రాంతంలో నిలబడి ప్రభుత్వ పనితీరును వివరించాలి. అంటే జగన్‌కు పాదయాత్ర.. లోకేశ్‌కు కౌంటర్ పాదయాత్ర. అది జరిగితే ఏపీ రాజకీయాల్లో కొత్త ప్రయోగమే. 2023లో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచింది. కుప్పం నుంచి ప్రారంభమైన యాత్ర 226 రోజుల పాటు కొనసాగి వేల కిలోమీటర్లు ప్రయాణించింది. అనేక అసెంబ్లీ నియోజకవర్గాలు, గ్రామాలను తాకింది. ఆ యాత్ర సమయంలో లోకేశ్‌పై విమర్శలు కూడా వచ్చాయి. వ్యంగ్యాలు వచ్చాయి. వ్యక్తిగత విమర్శలు కూడా వచ్చాయి. అయినా ఆయన యాత్రను కొనసాగించారు. చంద్రబాబు అరెస్టు తర్వాత యాత్రకు విరామం వచ్చినా మళ్లీ కొనసాగించారు. అది అప్పటి ప్రతిపక్ష నాయకుడి యాత్ర. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నం. అప్పుడు వైసీపీ ప్రభుత్వం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం. అప్పుడు లోకేశ్ ప్రభుత్వం మీద విమర్శలు చేసేవారు. ఇప్పుడు జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వంపై విమర్శలు చేయబోతున్నారు. అప్పుడు లోకేశ్‌కు మైక్ ఇచ్చిన వేదిక పాదయాత్ర. ఇప్పుడు లోకేశ్ చేతిలో ప్రభుత్వం చేసిన పనుల లెక్కలు ఉండొచ్చు. అందుకే రెండోసారి లోకేశ్ పాదయాత్ర చేస్తే అది యువగళం కొనసాగింపు కంటే భిన్నంగా ఉండాల్సిందే. యువత కోసం నడిచిన యువగళం స్థానంలో.. ప్రభుత్వ పనితీరును ప్రజల ముందుంచే జనబలం వంటి రాజకీయ బ్రాండింగ్‌ను టీడీపీ ఆలోచిస్తే దానికి ఒక వ్యూహాత్మక అర్థం ఉంటుంది.

**• జగన్ విమర్శిస్తారు.. లోకేశ్ వివరిస్తారు**

వైసీపీ ప్రధానంగా యాంటీఇంకంబెన్సీ మీద ఆశలు పెట్టుకోవడం సహజం. అధికారంలో ఉన్న ప్రభుత్వంపై అసంతృప్తి ఏర్పడటం రాజకీయాల్లో కొత్త విషయం కాదు. ధరలు, ఉద్యోగాలు, రైతు సమస్యలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు.. ఇవన్నీ ప్రతిపక్షానికి ఆయుధాలే. కానీ టీడీపీకి గత అనుభవం ఉంది. 2024 ఎన్నికల్లో కూటమి కేవలం వైసీపీ వ్యతిరేకతపైనే ఆధారపడలేదు. అమరావతి, పోలవరం, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతులు, పెట్టుబడులు, అభివృద్ధి వంటి అంశాలతో పాటు సంక్షేమానికి సంబంధించిన సూపర్ సిక్స్‌ను కూడా ప్రచారంలో ముందుకు తెచ్చింది. ఇప్పుడు 2029 నాటికి ఈ వాగ్దానాల్లో ఏ మేరకు అమలు జరిగిందో ప్రజలకు చూపించాల్సిన అవసరం అధికార కూటమిపై ఉంటుంది. అదే లోకేశ్ పాదయాత్రకు ప్రధాన బలం కావచ్చు. జగన్ అడిగే ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలు చెప్పాలి. జగన్ గత ప్రభుత్వ పథకాలను గుర్తుచేస్తే.. లోకేశ్ ప్రస్తుత ప్రభుత్వ పథకాలను గుర్తుచేయాలి. జగన్ సంక్షేమాన్ని మాట్లాడితే.. లోకేశ్ సంక్షేమంతో పాటు అభివృద్ధిని చూపించాలి. జగన్ గ్రామంలో ఒక రైతును కలిస్తే.. లోకేశ్ అదే గ్రామంలో ఆ రైతుకు ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. ఇది సాధారణ కౌంటర్ కాదు. ఇది నేరుగా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే కౌంటర్.

**• జగన్‌కు పరీక్ష.. లోకేశ్‌కు ఇబ్బంది**

జగన్ పాదయాత్ర చేస్తే ఆయన ముందు ప్రధాన సవాలు కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తిని రాజకీయ మద్దతుగా మార్చడం. కేవలం "ప్రభుత్వం తప్పు చేసింది" అంటే సరిపోదు. "మేము ఏం చేస్తాం?" అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. అమరావతి విషయంలో వైసీపీ స్పష్టమైన ప్రత్యామ్నాయ నమూనా ఏమిటి? పోలవరం విషయంలో ప్రణాళిక ఏమిటి? పెట్టుబడులు ఎలా తీసుకొస్తారు? ఉద్యోగాల విషయంలో ఏం చేస్తారు? రైతులకు సంక్షేమంతో పాటు మార్కెట్, సాగునీరు, ఆదాయం ఎలా పెంచుతారు? ఇవన్నీ చెప్పాల్సిందే. ఎందుకంటే 2029లో ప్రజలు కేవలం వ్యతిరేకతకు ఓటు వేయాలా? లేక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు ఓటు వేయాలా? అన్నది తేల్చుకోవాల్సి ఉంటుంది. జగన్‌కు పోటీగా లోకేశ్ పాదయాత్ర చేస్తే అది టీడీపీకి కూడా రిస్కే. అధికారంలో ఉన్న పార్టీకి పాదయాత్ర అంటే ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను వివరించే అవకాశం. కానీ అదే సమయంలో ప్రజలు అడిగే ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాలి. రోడ్డుపై నడుస్తున్నప్పుడు ఫైళ్లు కనిపించవు. అక్కడ కనిపించేది ప్రజలే. రైతు ప్రశ్నిస్తాడు. నిరుద్యోగి ప్రశ్నిస్తాడు. చిన్న వ్యాపారి ప్రశ్నిస్తాడు. పెన్షన్ లబ్ధిదారు ప్రశ్నిస్తాడు. స్థానిక నాయకుడు ప్రశ్నిస్తాడు. పార్టీ కార్యకర్త కూడా ప్రశ్నిస్తాడు. అందుకే లోకేశ్ పాదయాత్రకు నిజమైన పరీక్ష సభల్లో కాదు.. చిన్న గ్రామాల్లో ఉంటుంది.

ఇక్కడ మరో రాజకీయ పోటీ మొదలవుతుంది. జగన్‌కు ఎంత మంది వస్తారు? లోకేశ్‌కు ఎంత మంది వస్తారు? ఎవరి సభకు ఎక్కువ జనసందోహం? ఎవరి వెంట ఎక్కువ మంది నడుస్తారు? ఎవరి పాదయాత్రకు సోషల్ మీడియాలో ఎక్కువ స్పందన? ఎవరి యాత్రలో ఎక్కువ మంది స్థానికంగా సమస్యలు చెబుతారు? ఇలాంటి లెక్కలు మీడియా, సోషల్ మీడియా రోజూ తిప్పే అవకాశం ఉంది. కానీ జనసందోహం ఎన్నికల ఫలితం కాదు. పాదయాత్రలో కనిపించే జనబలం ఓటు పెట్టే రోజు అదే స్థాయిలో కనిపిస్తుందన్న గ్యారంటీ లేదు. అందుకే ఈ యాత్రల అసలు పరీక్ష ఫొటోలు కాదు.. ఫలితాలు.

**• రెండేళ్ల రాజకీయ కుంపటి**

జగన్ పాదయాత్ర వెళ్తే స్థానిక వైసీపీ వర్గాలు కదులుతాయి. లోకేశ్ యాత్ర వెళ్తే టీడీపీ క్యాడర్ కదులుతుంది. ఒకే ప్రాంతంలో రెండు పార్టీల శక్తి ప్రదర్శనలు జరిగితే స్థానిక రాజకీయ విభేదాలు మళ్లీ ముదిరే అవకాశం ఉంటుంది. ఎక్కడ చూసినా వర్గపోరు. ఎక్కడ చూసినా ఫ్లెక్సీల పోరు. ఎక్కడ చూసినా స్వాగత ర్యాలీలు. ఎక్కడ చూసినా కౌంటర్ సభలు. రాజకీయ వేడి పెరుగుతుంది. పాత కేసులు, పాత కక్షలు, పాత ఆరోపణలు మళ్లీ తెరమీదకు రావచ్చు. అందుకే వచ్చే రెండేళ్లు ఆంధ్రప్రదేశ్‌లో కేవలం ఎన్నికల సన్నాహాల కాలం కాదు. రాజకీయ ఉద్రిక్తతల కాలం కూడా కావచ్చు. నారా కుటుంబం, వైఎస్ కుటుంబం మధ్య రాజకీయ పోరు ఇప్పటికే సుదీర్ఘంగా కొనసాగుతోంది. 2029 ఎన్నికలు ఇరువర్గాలకూ మరో కీలక పరీక్ష. ఈసారి ఎవరు ఓడినా రాజకీయ ప్రభావం సాధారణంగా ఉండదు. అధికారంలో ఉన్నవారికి అధికారం నిలబెట్టుకోవడం సవాలు. ప్రతిపక్షానికి తిరిగి అధికారంలోకి రావడం జీవన్మరణ సమస్య.

**• చివరికి పాదయాత్రే కాదు..**
**పాదముద్ర ఎవరిది?**

జగన్ 2017లో పాదయాత్రకు బయలుదేరినప్పుడు ఆయన చేతిలో అధికారం లేదు. కానీ అధికారంపై ఆశ ఉంది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పెంచుకున్నారు. 2019లో అధికారాన్ని అందుకున్నారు. లోకేశ్ 2023లో పాదయాత్రకు బయలుదేరినప్పుడు టీడీపీ ప్రతిపక్షంలో ఉంది. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజా ఉద్యమంగా మార్చే ప్రయత్నం చేశారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పరిస్థితి తలకిందులైంది. జగన్ ప్రతిపక్షంలో ఉన్నారు. లోకేశ్ అధికారపక్షంలో ఉన్నారు. అందుకే జగన్ పాదయాత్రకు లోకేశ్ పాదయాత్ర సమాధానమైతే.. అది కేవలం రెండు నాయకుల నడక కాదు. రెండు రాజకీయ నమూనాల నడక. ఒకరు గత పాలనను గుర్తు చేస్తారు. మరొకరు ప్రస్తుత పాలనను చూపిస్తారు. ఒకరు సంక్షేమాన్ని ఆయుధంగా తీసుకుంటారు. మరొకరు సంక్షేమంతో పాటు అభివృద్ధిని కవచంగా పెట్టుకుంటారు. ఒకరు ప్రభుత్వ వ్యతిరేకతను రగిలించాలని చూస్తారు. మరొకరు ఆ వ్యతిరేకతను తమ వైపు రాకుండా అడ్డుకోవాలని చూస్తారు. అందుకే 2027 నుంచి ఏపీ రోడ్లపై కనిపించేది కేవలం నాయకుల నడక కాదు.. 2029 ఎన్నికల ట్రయల్ రన్.

**• అప్పుడు యువగళం.. ఇప్పుడు జనబలం**

అప్పుడు యువగళం.. ఇప్పుడు జనబలం. అప్పుడు అధికార మార్పు కోసం లోకేశ్ నడిచారు. ఇప్పుడు అధికారాన్ని నిలబెట్టుకోవడానికి నడవాల్సిన పరిస్థితి. అప్పుడు జగన్‌కు పాదయాత్ర సెంటిమెంట్. ఇప్పుడు జగన్ సెంటిమెంట్‌కు లోకేశ్ కౌంటర్. ఇక జగన్ అడుగు పడిన చోటే లోకేశ్ అడుగు పడితే.. ఏపీ రాజకీయాలకు కొత్త అర్థం వస్తుంది. ఒకరి వెనుక ఒకరు నడిచే ఇద్దరు నాయకులు కాదు.. ఒకరి మాటకు మరొకరి సమాధానం చెప్పే ఇద్దరు రాజకీయ ప్రత్యర్థులు. వచ్చే రెండేళ్లు అసెంబ్లీ కంటే రోడ్డే రాజకీయ వేదికలయ్యే అవకాశం ఉంది. సభల కంటే పాదయాత్రలే వార్తలవుతాయి. మ్యానిఫెస్టోల కంటే మైళ్ల లెక్కలు చర్చకు వస్తాయి. జనసందోహాల కంటే జనమనసు ఎవరివైపు ఉందన్నదే అసలు చర్చ అవుతుంది. చివరికి 5,000 కిలోమీటర్లు ఎవరు నడిచారన్నది చరిత్రలో ఒక సంఖ్య మాత్రమే. ఎవరి అడుగులు ప్రజల మనసుల్లో పాదముద్రలు వేశాయన్నదే 2029లో అసలు లెక్క. అందుకే జగన్‌కు పాదయాత్ర.. లోకేశ్‌కు జనబలం.. ఏపీకి మాత్రం వచ్చే రెండేళ్లు.. పాదయాత్ర జాతర!





**• పాదయాత్రకు పాదయాత్రే జవాబైతే?**

**2029** నాటికి అమరావతి రూపం మారితే జగన్‌కు ఒక రాజకీయ చిక్కు తప్పదు. పోలవరం పనులు గణనీయంగా ముందుకు వెళితే మరో ప్రశ్న. సాగునీటి ప్రాజెక్టులు కదిలితే ఇంకో ప్రశ్న. పెట్టుబడులు, పరిశ్రమలు, రహదారులు, మౌలిక వసతులు కళ్లముందు కనిపిస్తే.. "కూటమి ప్రభుత్వం ఏం చేసింది?" అనే ప్రశ్నను వైసీపీ మాత్రమే అడగడం కష్టమవుతుంది. అందుకే లోకేశ్ పాదయాత్రకు అభివృద్ధి ఒక ప్రధాన ఆయుధం కావచ్చు. జగన్‌కు సంక్షేమం ఉంటే.. లోకేశ్‌కు సంక్షేమం + అభివృద్ధి అనే కాంబినేషన్ ఉండాలి. ఇక్కడే 2029 రాజకీయ పోటీ ఆసక్తికరంగా మారుతుంది. ఎందుకంటే జగన్ గతంలో చెప్పిన సంక్షేమ మోడల్‌ను మళ్లీ ప్రజల ముందుంచుతారు. "మేము ఇచ్చాం.. మళ్లీ ఇస్తాం" అంటారు. టీడీపీ మాత్రం "మేము ఇస్తున్నాం.. అదే సమయంలో నిర్మిస్తున్నాం" అని చెప్పే ప్రయత్నం చేస్తుంది. ఒకరి దగ్గర గత ప్రభుత్వ జ్ఞాపకం ఉంటుంది. మరొకరి దగ్గర ప్రస్తుత ప్రభుత్వ పనుల దృశ్యం ఉంటుంది. ప్రజలు ఏది నమ్ముతారన్నదే అసలు తీర్పు. ఇక్కడే లోకేశ్ పాత్ర కీలకం. జగన్ పాదయాత్ర చేస్తే దానిని కేవలం వైసీపీ కార్యక్రమంగా చూడటం టీడీపీకి ప్రమాదకరం. ఎందుకంటే పాదయాత్ర అనేది కేవలం పార్టీ క్యాడర్ కార్యక్రమం కాదు. అది నాయకుడి ప్రజా ఇమేజ్‌ను మళ్లీ నిర్మించే ప్రక్రియ. జగన్ గతంలో పాదయాత్ర ద్వారా తనను తాను ప్రజల నాయకుడిగా మలుచుకున్నారు. లోకేశ్ కూడా యువగళం ద్వారా తనపై ఉన్న పాత ఇమేజ్‌ను మార్చుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు అదే లోకేశ్ అధికారపక్షం తరపున ప్రజల మధ్యకు వస్తే.. ఆయన ఎదుర్కొనే పరీక్ష మరింత పెద్దది. అప్పుడు ఆయన "ప్రభుత్వాన్ని మార్చండి" అన్నారు. ఇప్పుడు "ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోండి" అని చెప్పాలి. ఈ రెండు మాటల మధ్య రాజకీయ తేడా చాలా ఉంది.

తెలంగాణ రాజకీయ తెరపై కొండా దంపతుల కథ ఇప్పుడు ఉత్కంఠభరితమైన మలుపు తిరిగింది. ఒకప్పుడు ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టించిన కొండా సురేఖ.. ఇప్పుడు తన ప్రతి అడుగును కొలిచి వేయాల్సిన పరిస్థితిలో నిలిచారా? బిడ్డ కోసం గళమెత్తితే పార్టీతో పేచీ.. పార్టీని వీడితే రాజకీయంగా చేరేందుకు మరో గమ్యం కనిపించని సంకట స్థితి! కూతురి మాటలకు అండగా నిలవాలా.. కాంగ్రెస్ క్రమశిక్షణకు కట్టుబడి మౌనంగా ఉండాలా అన్న సందిగ్ధం కొండా కుటుంబాన్ని చుట్టుముట్టిందా? రేవంత్ రెడ్డి వ్యూహంలో చిక్కుకున్నారా.. లేక ఇదంతా రాజకీయంగా వేసిన మరో ఎత్తుగడా? ఒకవైపు అధిష్ఠానం హెచ్చరికలు.. మరోవైపు బీఆర్ఎస్ తలుపులు మూసేశామన్న స్పష్టమైన సంకేతాలు.. ఇప్పుడు బీజేపీ కూడా అసంతృప్త నేతలకు తమ పార్టీ 'డంపింగ్ బిన్' కాదని చెప్పడంతో కొండా దంపతుల ముందున్న దారులు ఒక్కొక్కటిగా మూసుకుపోతున్నాయా? గతంలో ప్రత్యర్థులపై చేసిన ఘాటు వ్యాఖ్యలే ఇప్పుడు తిరిగి రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయా? జగన్‌పై నాటి దూకుడు.. బీఆర్ఎస్ నేతలపై బూతులు, సవాళ్లు.. అన్నీ కలిసి కొత్త లెక్కలు వేస్తున్న వేళ.. "బిడ్డ వేరు.. మా దారి వేరు" అన్న కొండా సురేఖ మాటల వెనుక అసలు వ్యూహం ఏమిటి? కాంగ్రెస్‌లోనే ఉండి రాజకీయ మనుగడను కాపాడుకోవడం తప్ప మరో మార్గం లేదా?

# వాట్ వెంట్ రాంగ్

## మాకొద్దంటున్న పార్టీలు

- రాజకీయంగా దారులన్నీ మూసుకుపోయాయా?
- కానీ జనసేన ఆప్షన్ ఉందంటున్న అభిమానులు!





### • రాజకీయంగా దారులన్నీ మూసుకుపోయాయా?

తెలంగాణ రాజకీయాల్లో కొండా దంపతుల చుట్టూ ఇప్పుడు కనిపిస్తున్న పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూతురు కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. తల్లి కొండా సురేఖ రాజకీయ భవిష్యత్తుకు కొత్త చిక్కులు తెచ్చాయా? అనే చర్చ మొదలైంది. ఒకవైపు కాంగ్రెస్‌లో కొనసాగాల్సిన పరిస్థితి కనిపిస్తుంటే.. మరోవైపు బయటకు వెళ్లే మార్గాలు ఒక్కొక్కటిగా మూసుకుపోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొండా సురేఖ తన కూతురు వ్యాఖ్యలకు రాజకీయంగా సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కొండా దంపతులు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ముఖ్యంగా కుటుంబం కోసం దూకుడుగా ముందుకు వెళ్తే రాజకీయంగా నష్టం జరిగే అవకాశం ఉందన్న అంచనా వారిని ఆలోచనలో పడేసినట్టుగా కనిపిస్తోంది. బిడ్డ కోసం ఒక అడుగు ముందుకు వేస్తే పార్టీ పరంగా ఇబ్బంది.. వెనక్కి తగ్గితే కుటుంబపరంగా ఒత్తిడి అనే ద్వంద్వ పరిస్థితి ఏర్పడిందన్న చర్చ సాగుతోంది. దీంతో కొండా దంపతులు ఇకపై రాజకీయంగా చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందనే విశ్లేషణ వినిపిస్తోంది. ఒకప్పుడు తమదైన శైలిలో దూకుడుగా రాజకీయాలు చేసిన కొండా దంపతులు ఇప్పుడు ప్రతి మాటను కొలిచి మాట్లాడాల్సి వస్తోందన్నది తాజా పరిణామాల సారాంశంగా కనిపిస్తోంది.

### • రేవంత్ విసిరిన వలలో చిక్కారా?

కొండా దంపతుల రాజకీయ పరిస్థితిని పరిశీలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం కూడా చర్చకు వస్తోంది. రేవంత్ విసిరిన రాజకీయ వలలో కొండా దంపతులు చిక్కుకున్నారా? అన్న ప్రశ్నకు తెలంగాణ రాజకీయాల్లో భిన్నమైన సమాధానాలు వినిపిస్తున్నాయి. పరకాల నుంచి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాష్ రెడ్డి మరోసారి పోటీ చేస్తారంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యల తర్వాత కొండా ఫ్యామిలీలో ముసలం పుట్టింది. కొండా దంపతులు మొదట తమకు ఎదురవుతున్న సమస్యను కూతురు ద్వారా బయటకు ఎక్స్‌పోజ్ చేసిందువల్ల పరిస్థితి ఇంత దూరం వెళ్తుందని ఊహించి ఉండకపోవచ్చన్న అభిప్రాయం ఉంది. కూతురితో మాట్లాడిస్తే విషయం సద్దుమణుగుతుందని భావించి ఉండొచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అనుకున్నది ఒకటి.. జరిగింది మరోటి అన్నట్టుగా పరిణామాలు మలుపు తిరిగాయి. వ్యక్తిగత వ్యాఖ్యగా మొదలైన అంశం.. పార్టీ క్రమశిక్షణ.. నాయకత్వంపై విశ్వాసం.. భవిష్యత్ రాజకీయ సమీకరణాల చర్చగా మారింది. కొండా సురేఖను అలా వదిలేస్తే.. కాంగ్రెస్ చూస్తూ ఊరుకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అధిష్ఠానం వద్ద తన వాదన వినిపించారన్న రాజకీయ చర్చ కూడా ఉంది. అదే సమయంలో కొండా దంపతులను సాగనంపితే పార్టీకి పెద్దగా నష్టం ఉండదన్న వాదన కూడా వినిపించిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ రెండు వాదనల మధ్యే అసలు రాజకీయ లెక్క దాగి ఉందని పరిశీలకులు చెబుతున్నారు. కొండా దంపతులు తమ రాజకీయ బలాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తే అది పార్టీ అధిష్ఠానం వద్ద వేరే అర్థం తీసుకునే అవకాశం ఉంది. అందుకే రాజకీయ దూకుడు తగ్గించి.. పార్టీ గీత దాటకుండా ఉండటమే ప్రస్తుతం సురక్షిత మార్గం అన్న భావన బలపడుతున్నట్టు కనిపిస్తోంది.

### • గులాబీ తలుపులు మూసేశారా?

కొండా సురేఖకు కాంగ్రెస్ బయట రాజకీయ ప్రత్యామ్నాయం ఉందా అన్న ప్రశ్నకు కూడా తాజా పరిణామాలు ఆసక్తికర సమాధానం ఇస్తున్నాయి. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ వైపు వెళ్లే అవకాశాలపై రాజకీయ చర్చలు జరిగినా.. ఇప్పుడు ఆ మార్గం దాదాపు మూసుకుపోయినట్టుగా సంకేతాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లోకి కొండా సురేఖకు ప్రవేశం లేదన్న సందేశం చాలా స్పష్టంగా బయటకు వచ్చింది. మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ విషయంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండా సురేఖను తిరిగి బీఆర్ఎస్‌లోకి తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కొండా దంపతులను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమన్న స్థాయిలో ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలను తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో గులాబీ పార్టీ కఠిన వైఖరితో ఉందని ఆయన చెప్పడం చర్చకు దారితీసింది. ఒకరిద్దరు నేతలకు మినహాయింపు ఉండొచ్చని.. మిగతా వారికి పార్టీ తలుపులు తెరవబోమని ఆయన స్పష్టం చేసినట్లు రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు బీఆర్ఎస్ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా మిగలలేదన్న భావన బలపడుతోంది. కాంగ్రెస్‌లో అసంతృప్తి ఏర్పడినా వెంటనే బీఆర్ఎస్ వైపు వెళ్లే అవకాశం లేకపోవడం కొండా దంపతుల పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. రాజకీయంగా ఒక తలుపు మూసుకుపోతే మరో తలుపు తెరుచుకోవాలి. కానీ ఇప్పుడు ఆ రెండో తలుపు కూడా పూర్తిగా తెరుచుకోలేదన్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదే సమయంలో బీజేపీ వైపు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### • బీజేపీ నుంచి కూడా స్పష్టమైన సంకేతం

కొండా సురేఖ బీజేపీలో చేరతారన్న ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమయంలో బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. బీజేపీని అసంతృప్తి నేతల కోసం రాజకీయ డంపింగ్ బిన్‌గా చూడొద్దన్న సందేశాన్ని ఆయన స్పష్టంగా ఇచ్చారు. మీడియా ప్రతి రాజకీయ సంక్షోభంలోనూ బీజేపీ పేరును ఎందుకు లాగుతోందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఏదైనా అంతర్గత సంక్షోభం కనిపిస్తే వెంటనే బీజేపీలో చేరికలపై కథనాలు రావడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నిస్తూ ఎక్స్ వేదికగా ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్‌లో ఏర్పడుతున్న సమస్యను ముందుగానే ముగించేందుకు.. రాజకీయ చర్చను మరోవైపు మళ్లించేందుకు ఇలాంటి ఊహాగానాలు ఉపయోగపడుతున్నాయా అని ఆయన ప్రశ్నించారు. మురళీధర్ రావు వ్యాఖ్యలను పరిశీలిస్తే కొండా సురేఖను బీజేపీ తక్షణ రాజకీయ ప్రత్యామ్నాయంగా చూస్తోందన్న సంకేతం కనిపించలేదు. ఇదే కొండా దంపతుల ప్రస్తుత పరిస్థితిలో మరో కీలక అంశంగా మారింది. ఒకవైపు బీఆర్ఎస్ నుంచి గట్టి నిరాకరణ.. మరోవైపు బీజేపీ నుంచి కూడా స్వాగత సంకేతాలు కనిపించకపోవడం.. కాంగ్రెస్‌లోనే ఉండాల్సిన రాజకీయ అవసరాన్ని పెంచుతోంది. గతంలో కొండా సురేఖ రాజకీయ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన తీరు ఇప్పుడు తిరిగి చర్చకు వస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలపై ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్ అవుతున్నాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూడా ఆమె తీవ్ర విమర్శలు చేసిన విషయాన్ని కొందరు రాజకీయ నేతలు గుర్తు చేస్తున్నారు. దీంతో ప్రతి పార్టీతోనూ ఏదో ఒక దశలో తీవ్ర రాజకీయ విభేదాలు ఏర్పడిన నాయకురాలిగా ఆమెపై ఒక ప్రత్యేక రాజకీయ ముద్ర పడుతోందన్న చర్చ మొదలైంది. కొందరు ప్రచారం చేస్తున్నట్టుగా తెలంగాణలో జగన్మోహన్ రెడ్డి పార్టీ ప్రారంభిస్తే అందులోనూ కొండా దంపతులకు చోటు ఉంటుందా అన్న చర్చ కూడా జరుగుతోంది.



### • జగన్‌పై నాటి దూకుడు గుర్తు

కొండా సురేఖ రాజకీయ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూస్తే.. ఆమె మాట తీరు ఎప్పుడూ దూకుడుగానే కనిపించింది. ప్రత్యర్థి పార్టీలు.. ప్రత్యర్థి నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం ఆమె రాజకీయ శైలిలో భాగంగా మారింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో తమ రాజకీయమని మాట్లాడిన మాటలు, ఆ తర్వాత ఆయనపై చేసిన తీవ్ర విమర్శలను ఇప్పుడు కొందరు రాజకీయ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ అగ్రనేతలపై గతంలో ఆమె చేసిన ఘాటు వ్యాఖ్యలను కూడా గుర్తు చేస్తున్నారు. ఈ పాత వ్యాఖ్యలే ఇప్పుడు భవిష్యత్ రాజకీయ ప్రయాణానికి అడ్డంకులుగా మారుతున్నాయా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు ఉండరని సాధారణంగా చెబుతారు. కానీ ఒక నాయకుడు గతంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు.. భవిష్యత్‌లో అదే పార్టీతో రాజకీయంగా కలిసే సందర్భంలో ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉంటుంది. కొండా సురేఖ విషయంలో ఇప్పుడు అదే అంశం చర్చకు వస్తోంది. బీఆర్ఎస్‌లోకి వెళ్లే అవకాశం లేదన్న ఆ పార్టీ నేతల వ్యాఖ్యలు.. బీజేపీ నుంచి వచ్చిన తాజా సంకేతాలు కలిపి చూస్తే కాంగ్రెస్ వెలుపల ఆమెకు తక్షణ రాజకీయ స్థలం కనిపించడం లేదన్న విశ్లేషణ బలపడుతోంది. అందుకే ఇప్పుడు కొండా సురేఖ రాజకీయంగా తనను తాను కాంగ్రెస్ వాదిగానే ప్రదర్శించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్న వాదన వినిపిస్తోంది. కూతురు సుస్మిత రాజకీయంగా వేరే దారిలో మాట్లాడినా.. ఆ వ్యాఖ్యలకు తాను సంబంధం లేనట్టుగా వ్యవహరించాల్సిన పరిస్థితి రావడానికి ఇదే ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కుటుంబ బంధం ఒకటి.. రాజకీయ పార్టీ ప్రయోజనం మరోటి. ఈ రెండింటిని వేరు చేసి చూపించకపోతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందన్న అంచనా ఉంది.

### • రాజయ్య రాజీలా.. కొండా ఫ్యామిలీకి తప్పదా?

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో గత పరిణామాలను గుర్తు చేసుకుంటే.. పార్టీ నాయకత్వంతో విభేదాలు వచ్చిన సందర్భాల్లో కొందరు నేతలు చివరకు రాజీ మార్గాన్నే ఎంచుకున్న ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు కొండా దంపతుల విషయంలో కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందా అన్న చర్చ మొదలైంది. నాడు బీఆర్ఎస్ హయాంలో బర్తరఫ్ అయిన మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య రాజీపడినట్టుగా.. ఇప్పుడు కొండా దంపతులు కూడా రాజకీయంగా వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి వచ్చిందా? అన్న ప్రశ్నకు ప్రస్తుత పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. బిడ్డ కోసం దూకుడుగా ముందుకు వెళ్తే కాంగ్రెస్‌తో దూరం పెరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్‌తో దూరం పెరిగితే బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ప్రత్యామ్నాయ వేదికలు కూడా స్పష్టంగా కనిపించడం లేదు. బీఆర్ఎస్ ఇప్పటికే కఠినమైన సంకేతం ఇచ్చింది. బీజేపీ కూడా అసంతృప్తి నేతల కోసం తమ పార్టీ తలుపులు తెరిచి ఉంచలేదన్న సందేశాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొండా దంపతులకు ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే కొనసాగడం రాజకీయంగా తప్పనిసరి మార్గంగా మారిందన్న భావన బలపడుతోంది. అయితే కాంగ్రెస్‌లో కొనసాగడం అంటే గతంలో ఉన్నట్టుగా స్వేచ్ఛగా రాజకీయ దూకుడు ప్రదర్శించడం కాదని కూడా తాజా పరిణామాలు చెబుతున్నాయి. కూతురు దారి వేరు.. తమ దారి వేరు అన్న స్పష్టమైన రాజకీయ రేఖను గీయాల్సిన అవసరం ఏర్పడింది. ఇకపై కొండా సురేఖ కాంగ్రెస్ నాయకురాలిగానే తన రాజకీయ గుర్తింపును బలపరచుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ నిర్ణయాలను గౌరవించడం.. వ్యక్తిగత రాజకీయ భేదాలను పార్టీ వ్యవస్థకు దూరంగా ఉంచడం.. అధిష్ఠానం విశ్వాసాన్ని తిరిగి బలపరచడం ఆమె ముందున్న ప్రధాన సవాళ్లుగా కనిపిస్తున్నాయి. కొండా అంటే వామ్మో అనే స్థాయిలో రాజకీయ భయం ఏర్పడిందా? లేక ఇది ఒక తాత్కాలిక రాజకీయ దశ మాత్రమేనా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. కానీ ప్రస్తుతం మాత్రం బిడ్డ కోసం ఒక అడుగు వేస్తే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం.. రాజకీయంగా వెనక్కి తగ్గితే కుటుంబపరమైన అసంతృప్తి మిగిలే అవకాశం కనిపిస్తోంది. అందుకే కొండా దంపతులు మౌనం.. సంయమనం.. పార్టీతో రాజీ అనే మూడు మార్గాలపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నది తాజా రాజకీయ చిత్రంగా కనిపిస్తోంది.

### • కొండా కిం కర్తవ్యం

ఇక అసలు ప్రశ్న ఒక్కటే.. ఈ తీరం ఏ నావకు చేరుతుంది? కొండా దంపతుల రాజకీయ నావకు కాంగ్రెస్ తీరం కనిపిస్తున్నా.. అక్కడి అలలు మాత్రం ప్రశాంతంగా లేవు. బీఆర్ఎస్ తలుపులు మూసేసింది.. బీజేపీ గేటు దగ్గరికి వచ్చినా "ఇది రాజకీయ పునరావాస కేంద్రం కాదు" అన్నట్టుగా చూస్తోంది. కాంగ్రెస్ మాత్రం "నావలో ఉన్నవారు దిగాల్సిన అవసరం లేదు.. కానీ తెడ్డు మాత్రం మా చేతిలోనే ఉండాలి" అన్నట్టుగా సంకేతాలు ఇస్తోంది. కూతురు ఒక దిశలో ఈదుతుంటే.. తల్లిదండ్రులు మరో దిశలో తీరాన్ని వెతుకుతున్నారు. కుటుంబం ఒకే పడవలో ఉందా.. లేక ఒక్కొక్కరు ఒక్కో తెప్పపై ప్రయాణిస్తున్నారా అన్నది కూడా స్పష్టంగా లేదు. నిన్నటి వరకు ప్రత్యర్థులపై విరుచుకుపడిన మాటలు.. ఇవాళ రాజకీయ బరువును కొలిచే తూకాలుగా మారాయి. ఎవరిని విమర్శించాలి.. ఎవరిని పలకరించాలి.. ఎవరిని దూరంగా ఉంచాలి అన్న లెక్కల్లోనే తెడ్డు తిరుగుతోంది. అయితే రాజకీయాల్లో నావకు దిశ కంటే.. గాలి ముఖ్యం. గాలి మారితే నావ కూడా మారుతుంది.. నావికుడి సిద్ధాంతం కూడా మారుతుంది. చివరకు కొండా నావ కాంగ్రెస్ ఒడ్డునే కట్టేస్తారా.. లేక కొత్త జెండా ఎగరేసి మరో తీరం వైపు బయలుదేరుతారా అన్నది కాలమే చెప్పాలి.

### • చివరి అస్త్రం.. జనసేన!

కొండా దంపతుల రాజకీయ ప్రయాణంలో ఇప్పుడు జనసేన అస్త్రం తెరపైకి వస్తోందా? కాంగ్రెస్‌లో కొనసాగాలా.. మరో దారి వెతకాలా అన్న సందిగ్ధంలో ఉన్న సమయంలో పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన తెలంగాణలో విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో 21 గెలిచి 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించానంటోంది. ఇప్పుడు తెలంగాణలోనూ పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది. కొండా సుస్మిత జనసేన నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారన్న వార్తలు కూడా తాజాగా వెలువడ్డాయి. దీంతో కొండా దంపతుల ముందున్న రాజకీయ లెక్కల్లో జనసేన కూడా ఒక అవకాశంగా కనిపిస్తోంది. అయితే అసలు ట్విస్ట్ ఇక్కడే.. కొండా దంపతుల దూకుడు.. పవన్ కల్యాణ్ రాజకీయ శైలి.. ఈ రెండింటి మధ్య డీలింగ్ ఎలా ఉంటుంది? కాపు సమీకరణం తెలంగాణలో ఆశించినంతగా పనిచేయకపోయినా.. కొండా కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు, ప్రభావం జనసేనకు ఉపయోగపడతాయా అన్నది ఆసక్తికరం. తాజా పరిస్థితుల్లో ఇది మార్గమా.. మళ్లీ మరో మలుపా అన్నది చూడాలి.



## రోమియో నుంచి జూలియట్ కోరుకున్నదేంటి?

## పవిత్ర ప్రేమ నుంచి అపవిత్ర బంధాల దాకా..

## అవసరాల కోసమే సంబంధాల ప్రేమాయణం



చూపు అనేది మాటలు పుట్టకముందే పుట్టిన భాష. పెదవులు పలకని మాటను కళ్ళు పలుకుతాయి. మనసులో దాచుకున్న ఇష్టాన్ని, సంకోచాన్ని, అనుమతిని, నిరాకరణను, ఆరాధనను, ఆకర్షణను ఒక్క చూపే చెప్పగలదు. అందుకే ప్రేమకథల్లో తొలి అధ్యాయం చాలాసార్లు మాటలతో కాదు.. చూపులతోనే మొదలవుతుంది. ఒక చూపు మనసును తాకుతుంది. రెండో చూపు ఆలోచనగా మారుతుంది. మూడో చూపు ఎదురుచూపును పుడుతుంది. ఆ ఎదురుచూపే ప్రేమగా మారుతుంది. లైలా–మజ్ను కథలో ప్రేమ అనేది పొందడం కంటే తపించడం. రోమియో–జూలియట్ కథలో ప్రేమ అనేది సామాజిక గోడలకు ఎదురొడ్డి నిలబడటం. ఈ కథల్లో చూపులు కేవలం శరీర ఆకర్షణకు సంకేతాలు కావు. అవి ఒక వ్యక్తిని మరొక వ్యక్తిగా కాకుండా, తన ప్రపంచంలో ప్రత్యేకమైన మనిషిగా గుర్తించే క్షణాలు. ప్రేమకు మూలం ఆకర్షణ కావచ్చు. కానీ ప్రేమను నిలబెట్టేది ఆకర్షణ ఒక్కటే కాదు. అవగాహన, గౌరవం, నమ్మకం, బాధ్యత, పరస్పర సమ్మతి కలిసినప్పుడే ఆ ఆకర్షణకు సంబంధం అనే అర్థం వస్తుంది. ఒకప్పుడు ప్రేమలో చూపు ఒక వాగ్దానం. ఇప్పుడు చూపు ఒక నోటిఫికేషన్. ఒకప్పుడు ఎదుటివారి కళ్ళలోకి చూడటానికి రోజులు ఎదురుచూసేవారు. ఇప్పుడు ఒక ప్రొఫైల్ ఫోటో చూస్తే చాలు. ఒకప్పుడు ఒక ఉత్తరం కోసం వారం ఎదురుచూపు. ఇప్పుడు ఒక మెసేజ్‌కు 'seen' వచ్చిందా లేదా అన్నదే ఆందోళన. ఒకప్పుడు ప్రేమ నెమ్మదిగా పెరిగేది. ఇప్పుడు పరిచయం వేగంగా మొదలై, ఆకర్షణ ఇంకా వేగంగా పెరిగి, సంబంధం అంతకంటే వేగంగా ముగిసిపోతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇక్కడే మనం ఒక అసౌకర్యమైన ప్రశ్న అడగాలి. మనం ప్రేమను ఆధునికం చేసుకున్నామా? లేక ఆకర్షణను ప్రేమగా పొరబడుతున్నామా?

# చూపులు కలసిన.. శుభ వేళ

## లైలా నుంచి మజ్ను ఏం కోరుకున్నాడు?

### చూపుల్లో ప్రేమ.. స్పర్శలోనేనా?

లైలా-మజ్ను, రోమియో-జూలియట్ వంటి కథలను గుర్తు చేసుకుంటే ప్రేమలో ఒకప్పుడు ఉన్న తీవ్రత అర్థమవుతుంది. అక్కడ ప్రేమకు అడ్డంకులు ఉన్నాయి. కుటుంబాలు ఉన్నాయి. సమాజం ఉంది. దూరం ఉంది. ఎదురుచూపు ఉంది. అందుకే ఒకరిని మరొకరు చూసే అవకాశం కూడా విలువైనదే. ఒక చూపు కోసం ఎదురు చూడటం ప్రేమలో భాగం. ఒక మాట కోసం ఆత్రుత పడటం ప్రేమలో భాగం. ఒకరిని అర్థం చేసుకోవడానికి సమయం తీసుకోవడం ప్రేమలో భాగం. కానీ కాలం మారింది. సాంకేతికత మన మధ్య దూరాలను తగ్గించింది. అదే సమయంలో మనసుల మధ్య సహనాన్ని కూడా తగ్గించినట్టుగా కనిపిస్తోంది. ఇప్పుడు పరిచయం కావడానికి క్షణం చాలు. ఫోటో నచ్చితే లైక్. మాట నచ్చితే చాట్. ఆకర్షణ పెరిగితే కలుసుకోవడం. కొన్ని సందర్భాల్లో భావోద్వేగ అనుబంధం ఏర్పడకముందే శారీరక సాన్నిహిత్యం గురించి నిర్ణయాలు తీసుకోవడం. ఇది తప్పు అని ఒకే గీతతో చెప్పలేం. కానీ ఇది ప్రేమకు సమానమని కూడా చెప్పలేం. సెక్సాలజీ ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతుంది. లైంగిక ఆకర్షణ, ప్రేమ, భావోద్వేగ అనుబంధం ఇవి పరస్పరం సంబంధం ఉన్నప్పటికీ ఒకటే కావు. ఒక వ్యక్తి పట్ల శారీరక ఆకర్షణ ఉండొచ్చు. అదే వ్యక్తి పట్ల ప్రేమ లేకపోవచ్చు. ప్రేమ ఉండొచ్చు కానీ శారీరక ఆకర్షణ తక్కువగా ఉండొచ్చు. భావోద్వేగ బంధం ఉండొచ్చు కానీ లైంగిక సంబంధం ఉండకపోవచ్చు. ఈ తేడాలను అర్థం చేసుకోకపోతే సంబంధాల విషయంలో అపార్థాలు మొదలవుతాయి. మన సమాజంలో ఇక్కడే ఒక పెద్ద గందరగోళం ఉంది. ప్రేమ అంటే శారీరక సంబంధమే అని కొందరు భావిస్తున్నారు. మరోవైపు శారీరక ఆకర్షణను పూర్తిగా చెడ్డదిగా చూసేవాళ్లు కూడా ఉన్నారు. రెండూ అతిశయాలే. మానవ సంబంధాల్లో శారీరక ఆకర్షణ సహజమైన భాగం. కానీ అది సమ్మతి, గౌరవం, బాధ్యత, పరస్పర భద్రత లేకుండా సంబంధానికి నైతికతను ఇవ్వదు.

### చూపే బంగారమవుతోందా?

చూపు మొదటి మెట్టు కావచ్చు. కానీ చూపు అనుమతి కాదు. ఒకరు నవ్వారు అంటే సమ్మతి కాదు. ఒకరు మాట్లాడారు అంటే సమ్మతి కాదు. ఒకరు దగ్గరగా వచ్చారు అంటే సమ్మతి కాదు. గతంలో ఒకసారి అంగీకరించారు అంటే ప్రతిసారీ అంగీకరించినట్టూ కాదు. ఆధునిక సెక్సాలజీ, సంబంధాల ఆరోగ్యకరమైన అవగాహనలో స్పష్టమైన, స్వచ్ఛందమైన, నిరంతర సమ్మతి అత్యంత కీలకం. ప్రేమ ఎంత గొప్పదైనా ఎదుటివారి ఇష్టాన్ని దాటే హక్కు ఎవరికీ ఇవ్వదు. ఇది చెప్పాల్సిన అవసరం ఎందుకు వచ్చింది అంటే, నేటి సంబంధాల్లో వేగం పెరిగింది. డేటింగ్ యాప్స్, సోషల్ మీడియా, మెసేజింగ్ ప్లాట్‌ఫార్మ్స్ పరిచయాలను సులభం చేశాయి. కానీ పరిచయం సులభమైంది కాబట్టి అనుబంధం కూడా లోతుగా మారుతుందని లేదు. డిజిటల్ ప్రపంచంలో మనం ఒక వ్యక్తి జీవితంలోని ఎంపిక చేసిన చిత్రాలను చూస్తాం. ఆ చిత్రాల ఆధారంగా ఒక మనిషి గురించి పూర్తి కథను ఊహించుకుంటాం. అక్కడే ఆకర్షణ మొదలవుతుంది. ఊహ ప్రేమలా అనిపిస్తుంది. నిజమైన సంబంధం మొదలైనప్పుడు మాత్రం అసలు వ్యక్తి కనిపిస్తాడు. అలవాట్లు కనిపిస్తాయి. బలహీనతలు కనిపిస్తాయి. కోపం కనిపిస్తుంది. బాధ్యతలు కనిపిస్తాయి. భిన్నాభిప్రాయాలు బయటపడతాయి. అప్పుడే తెలుస్తుంది. మనం ప్రేమించింది ఆ వ్యక్తినేనా? లేక మన ఊహలో తయారు చేసుకున్న వ్యక్తినేనా? పాతకాలపు ప్రేమలో ఈ పరీక్షకు సమయం ఉండేది. నేటి ప్రేమలో సమయం లేదు. వెంటనే సమాధానం కావాలి. వెంటనే స్పందన కావాలి. వెంటనే దగ్గరవ్వాలి. వెంటనే సంబంధానికి పేరు పెట్టాలి. వెంటనే శారీరక సాన్నిహిత్యం కావాలి. వెంటనే మరో వ్యక్తిని కూడా వెతుక్కోవచ్చు. ఈ వేగం సంబంధాలను అవకాశాల మార్కెట్‌గా మార్చేస్తోంది. అందుకే నేటి ప్రేమలో ఒక కొత్త పదం బలంగా వినిపిస్తోంది అదే కనెక్షన్.. కానీ కనెక్షన్ అంటే ఏమిటి? రోజంతా చాటింగ్ చేయడమా? రాత్రంతా వీడియో కాల్‌లో ఉండడమా? ఒకరి ఫొటోలకు మరొకరు స్పందించడమా? లేక ఒకరి మౌనాన్ని మరొకరు అర్థం చేసుకోగలగడమా?

### ఆకర్షణ వేరు..

### అసలైన ప్రేమ వేరు

కనెక్షన్ స్క్రీన్‌లో కనిపించదు. అది ప్రవర్తనలో కనిపిస్తుంది. అక్కడి నుంచే పవిత్ర ప్రేమకు, అపవిత్ర బంధానికి మధ్య గీత మొదలవుతుంది. ఆ గీత శారీరక సంబంధంతో మాత్రమే నిర్ణయించబడదు. ఇద్దరు పెద్దలు పరస్పర సమ్మతితో, గౌరవంతో, బాధ్యతతో సంబంధంలో ఉంటే దాన్ని కేవలం శారీరకత ఉందని అపవిత్రం అని పిలవడం సరైంది కాదు. అదే సమయంలో ప్రేమ పేరుతో మోసం చేయడం, దాచిపెట్టడం, వాడుకోవడం, ఒత్తిడి చేయడం, భావోద్వేగాలను దోపిడీ చేయడం జరిగితే అది సంబంధం కాదు.. దుర్వినియోగం. ఇది చాలా స్పష్టంగా చెప్పాలి. శరీరానికి దగ్గరవడం సులభం. మనసుకు దగ్గరవడం కష్టం. శారీరక ఆకర్షణలో మెదడు కొన్ని రసాయన మార్పులకు స్పందిస్తుంది. ఆకర్షణ, ఉత్సాహం, కొత్తదనం మన అనుభూతులను బలంగా ప్రభావితం చేస్తాయి. అందుకే కొత్త పరిచయం కొన్నిసార్లు అసాధారణమైన ఆనందాన్ని కలిగిస్తుంది. ఆ ఉత్సాహాన్ని మనం ప్రేమగా భావించవచ్చు. కానీ ఉత్సాహం తగ్గిన తర్వాత కూడా ఒకరి పట్ల మరొకరికి గౌరవం, బాధ్యత, ఆసక్తి, అనుబంధం కొనసాగితేనే అక్కడ సంబంధానికి బలం ఉందని చెప్పవచ్చు. లేకపోతే అది ఆకర్షణ. ఆకర్షణ తప్పు కాదు. కానీ ఆకర్షణకు ప్రేమ అనే పేరు పెట్టడం తప్పుదోవ పట్టించవచ్చు. ఇంకో ప్రమాదం. వినియోగ సంస్కృతి. మనుషులను కూడా వస్తువుల్లా మార్చే ప్రమాదం. నచ్చింది తీసుకున్నాం.. నచ్చలేదు వదిలేశాం... కొత్త వ్యక్తి కనిపించాడు.. పాత సంబంధం ముగిసింది. ఒకప్పుడు ప్రేమలో వ్యక్తి విలువ ముఖ్యం. ఇప్పుడు కొన్నిసార్లు 'ఎంత ఆకర్షణీయంగా ఉన్నాడు?', 'ఎంత అందంగా ఉంది?', 'ఎంత ఫిట్‌గా ఉంది?' అనే ప్రమాణాలే ముందుకు వస్తున్నాయి.

### ప్రేమకు కాలం కాదు నాణ్యతే

### అసలు కొలమానం

శరీరం సంబంధానికి ఒక భాగం. మొత్తం సంబంధం కాదు. ఇది అర్థం కాకపోతే మనిషి తనకూ, ఎదుటివారికీ అన్యాయం చేస్తాడు.



శరీరాన్ని మాత్రమే చూసే సంబంధం చివరకు అసంతృప్తిని తెస్తుంది. ఎందుకంటే శరీరం మారుతుంది. వయసు మారుతుంది. పరిస్థితులు మారుతాయి. అందం మారుతుంది. కానీ మనసు కోరుకునే భద్రత, గౌరవం, ఆత్మీయత, తోడు అనే అవసరాలు కొనసాగుతాయి. అందుకే లైలా-మజ్ను ప్రేమను, రోమియో-జూలియట్ ప్రేమను కేవలం విషాద కథలుగా చూడకూడదు. అవి తమ కాలానికి చెందిన ప్రేమకథలు. వాటిలోని ప్రతి అంశాన్ని నేటి జీవితానికి యథాతథంగా అన్వయించాల్సిన అవసరం లేదు. కానీ ఒక విషయం మాత్రం నేర్చుకోవచ్చు — ప్రేమ అనేది ఒక వ్యక్తిని పొందడమే కాదు.. ఆ వ్యక్తి మనసును గౌరవించడం కూడా. అయితే పాతకాలపు ప్రేమను పూర్తిగా పవిత్రంగా, నేటి ప్రేమను పూర్తిగా అపవిత్రంగా చిత్రించడం కూడా నిజం కాదు. పాత సమాజాల్లోనూ మోసాలు ఉన్నాయి. బలవంతపు వివాహాలు ఉన్నాయి. మహిళలకు స్వేచ్ఛ లేకపోవడం ఉంది. ప్రేమ పేరుతో త్యాగాన్ని మాత్రమే గొప్పగా చూపించి వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని అణచివేసిన సందర్భాలూ ఉన్నాయి. కాబట్టి కాలాన్ని కాదు, సంబంధం నాణ్యతను కొలవాలి. నేటి యువతకు అసలు అవసరం ఇదే.. ప్రేమపై నైతిక ఉపన్యాసం కాదు; సంబంధాలపై శాస్త్రీయ అవగాహన. లైంగికత గురించి మాట్లాడటం అంటే అశ్లీలత కాదు. సెక్సాలజీ అంటే కేవలం శారీరక సంబంధాల గురించి మాట్లాడటం కాదు. లైంగిక ఆరోగ్యం, సమ్మతి, శరీర అవగాహన, భావోద్వేగ అనుబంధం, సంబంధాల్లో పరస్పర గౌరవం, సురక్షిత ప్రవర్తన, లైంగిక అపోహలను తొలగించడం.. ఇవన్నీ దాని పరిధిలోకి వస్తాయి. ఈ విషయాలను ఆరోగ్యకరమైన భాషలో నేర్పకపోతే ఇంటర్నెట్ నేర్పుతుంది.

### చూపుల్లో గౌరవం ఉంటే

### ప్రేమే విలువ చాటేది!

ఇంటర్నెట్‌లో మాత్రం విజ్ఞానం పక్కనే అపోహలు, పోర్నోగ్రఫీ, అవాస్తవ అంచనాలు కూడా ఉంటాయి. అక్కడే మరో సమస్య మొదలవుతుంది. తెరపై కనిపించే శరీరాలను నిజ జీవిత సంబంధాలకు ప్రమాణంగా తీసుకోవడం. పోర్నోగ్రఫీ ఒక వాస్తవ సంబంధానికి శిక్షణ పుస్తకం కాదు. అందులోని చిత్రీకరణలు, శరీర భాష, ప్రవర్తనలు, ప్రతిస్పందనలు వాస్తవ జీవితానికి సాధారణ ప్రమాణాలు కావు. కానీ అవగాహన లేకపోతే యువత వాటినే సంబంధాల కొలమానంగా భావించే ప్రమాదం ఉంది. నిజమైన ప్రేమలో నటన ఉండదు. కెమెరా ఉండదు. ఎడిటింగ్ ఉండదు. ప్రతి మనిషికి తన వేగం ఉంటుంది. తన హద్దులు ఉంటాయి. తన ఇష్టం ఉంటుంది. తన భయం ఉంటుంది. తన అసౌకర్యం ఉంటుంది. ఆ హద్దులను గౌరవించడం కూడా ప్రేమే. అందుకే ఈ కాలంలో మళ్లీ చూపుల విలువను గుర్తు చేసుకోవాలి. కానీ ఆ చూపు పాతకాలపు సిగ్గు కోసం కాదు. నియంత్రణ కోసం కాదు. ఎదుటివారిని ఆస్తిగా భావించడానికి కాదు. మనిషిగా చూడడానికి. ఒకరి కళ్ళలోకి చూస్తూ.. 'నీకు ఇది ఇష్టమేనా?' అని అడగగలగడం ఆధునిక ప్రేమలో గొప్ప లక్షణం. సమాధానం 'లేదు' అయితే వెనక్కి తగ్గగలగడం ఇంకా గొప్ప లక్షణం. ఎదుటివారి నిర్ణయాన్ని గౌరవించడం ప్రేమకు పరీక్ష. ప్రేమలో శరీరం ఉండవచ్చు. కోరిక ఉండవచ్చు. లైంగిక ఆకర్షణ ఉండవచ్చు. కానీ అవి ప్రేమను మింగేయకూడదు. శరీరం మనిషిలో ఒక భాగం మాత్రమే. మనిషి అంతా శరీరం కాదు. ఇక 'అపవిత్ర బంధం' అనే పదాన్ని కూడా జాగ్రత్తగా ఉపయోగించాలి. ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత సంబంధాన్ని బయటివారు తమ నైతిక ప్రమాణాలతో కొలవడం కంటే, ఆ సంబంధంలో మోసం ఉందా? బలవంతం ఉందా? దుర్వినియోగం ఉందా? సమ్మతి ఉందా? పరస్పర గౌరవం ఉందా? బాధ్యత ఉందా? అనేదే అసలు ప్రశ్న.

### శరీరాలు కాదు..

### మనసులు కలిసే వేళ ప్రేమ

ఎందుకంటే పవిత్రత శరీరంలో ఉండదు. ప్రవర్తనలో ఉంటుంది. ఒక సంబంధంలో శారీరక సాన్నిహిత్యం ఉండి కూడా గౌరవం ఉండవచ్చు. మరో సంబంధంలో పెళ్లి అనే సామాజిక ముద్ర ఉండి కూడా అవమానం, హింస, ద్రోహం ఉండవచ్చు. కాబట్టి బంధానికి పవిత్రతను ఇచ్చేది కేవలం సామాజిక ముద్ర కాదు. అందులోని మానవత్వం. చూపులు కలిసిన శుభవేళ అంటే కేవలం ఇద్దరు మనుషుల కళ్ళు కలిసిన క్షణం కాదు. ఇద్దరి స్వేచ్ఛలు పరస్పరం గౌరవించుకున్న క్షణం. ఇద్దరి కోరికలు ఒకరి మీద మరొకరు రుద్దుకోకుండా కలిసిన క్షణం. ఆకర్షణకు అవగాహన తోడైన క్షణం. శరీరానికి మనసు తోడైన క్షణం. మనసుకు బాధ్యత తోడైన క్షణం. లైలా–మజ్ను ప్రేమలో ఉన్న తపనను మనం గుర్తుంచుకోవచ్చు. రోమియో–జూలియట్ ప్రేమలో ఉన్న తీవ్రతను గుర్తుంచుకోవచ్చు. కానీ నేటి కాలానికి అవసరమైనది వాటి విషాదాన్ని పునరావృతం చేయడం కాదు. వాటి నుంచి ప్రేమ విలువను తీసుకుని, ఆధునిక జ్ఞానంతో సంబంధాలను నిర్మించడం. ఒకప్పుడు ప్రేమ కోసం ఉత్తరాలు రాశారు. ఇప్పుడు మెసేజ్లు పంపుతున్నారు. ఒకప్పుడు కిటికీ దగ్గర నిలబడి ఒక చూపు కోసం ఎదురుచూశారు. ఇప్పుడు స్క్రీన్‌పై 'ఆన్‌లైన్' కోసం చూస్తున్నారు. ఒకప్పుడు ఒకరి గురించి తెలుసుకోవడానికి నెలలు పట్టేది. ఇప్పుడు కొన్ని గంటల్లోనే వ్యక్తిగత విషయాలు పంచుకుంటున్నారు. సాంకేతికత మారింది. మనిషి మాత్రం మారలేదు. ఇప్పటికీ అతనికి ఆప్యాయత కావాలి. ఆమెకు భద్రత కావాలి. ఇద్దరికీ గౌరవం కావాలి. ఇద్దరికీ వినిపించే మనసు కావాలి. ఇద్దరికీ తమ హద్దులను గౌరవించే భాగస్వామి కావాలి. అందుకే చివరికి ప్రేమను తిరిగి నిర్వచించాల్సిన అవసరం లేదు. ప్రేమను సరిగ్గా అర్థం చేసుకోవాలి. చూపు ఆకర్షించవచ్చు. మాట దగ్గర చేయవచ్చు. స్పర్శ అనుభూతిని కలిగించవచ్చు. కానీ నమ్మకమే బంధాన్ని నిలబెడుతుంది. శరీరాలు కలవడం సంబంధానికి ముగింపు కాదు. మనసులు కలవకపోతే అది మొదలైనట్టే కాదు. ఈ కాలంలో మనం కోల్పోయింది చూపు కాదు. చూపులోని అర్థం. కోల్పోయింది ప్రేమ కాదు. ప్రేమకు కావాల్సిన సహనం. కోల్పోయింది శారీరకత కాదు. దానికి కావాల్సిన బాధ్యత. అందుకే మళ్లీ ఒకసారి ఎదుటివారి కళ్ళలోకి చూడాలి. తొందర లేకుండా. అంచనా లేకుండా. స్వార్థం లేకుండా. ఆ చూపులో ఆకర్షణ ఉండొచ్చు. కోరిక ఉండొచ్చు. ప్రేమ ఉండొచ్చు. కానీ అన్నింటికంటే ముందు ఒక మనిషి ఉండాలి. అప్పుడు మాత్రమే.. చూపులు కలసిన శుభవేళ... బంధం మొదలైన పవిత్ర వేళ అవుతుంది.



## పాక్ కోచ్ మౌనం

- ముగ్గురు సీనియర్ల ఉద్వాసన
- నిర్ణయం నాదికాదన్న హెస్సన్
- కారణమేంటో తెలియదని వెల్లడి

ఇంగ్లండ్‌లో వరుస పరాజయాలతో పాకిస్థాన్ క్రికెట్‌లో కలకలం రేగింది. తొలి రెండు టెస్టుల్లో ఘోర ఓటముల తర్వాత ఏకంగా ఏడుగురు ఆటగాళ్లపై వేటు పడింది. సర్ఫరాజ్ అహ్మద్ కోచ్ పదవిని కోల్పోయారు. సీనియర్లు మహ్మద్ రిజ్వాన్, సల్మాన్ ఆఘా, ఇమామ్‌ఉల్‌హక్‌ను జట్టు నుంచి తప్పించడంపై తాత్కాలిక రెడ్‌బాల్ కోచ్ మైక్ హెస్సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ముగ్గురిని తొలగించే నిర్ణయంలో తనకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేశారు. తాను బాధ్యతలు చేపట్టే సమయానికే వారు జట్టు నుంచి విడుదలై స్వదేశానికి వెళ్లిపోయారని, అసలు ఏం జరిగిందో తనకు తెలియదని చెప్పారు. మిగిలిన ఆటగాళ్ల విడుదల, కొత్త ఆటగాళ్ల ఎంపికలో మాత్రం తాను భాగస్వామినని వెల్లడించారు. జట్టుకు సమతుల్యత తీసుకురావడమే తన లక్ష్యమని, వైవిధ్యంతో కూడిన బౌలింగ్ దళంతో పాటు ఇద్దరు బౌలింగ్ ఆల్‌రౌండర్లను తీసుకోవడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. కొందరు కొత్త ఆటగాళ్లు కొంతకాలంగా పోటీ క్రికెట్ ఆడకపోయినా ప్రతిభ ఉందన్నారు. సల్మాన్ ఆఘా మంచి ఆటగాడని, దేశవాళీ క్రికెట్ ఆడుతూ తిరిగి జట్టులోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ముగ్గురి ఉద్వాసన క్రమశిక్షణా చర్యలకు సంబంధించినదన్న వార్తలకు హెస్సన్ వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లో జరిగే మూడో టెస్టుపైనే తమ దృష్టి ఉందన్నారు.

# పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

## స్పిన్నర్ల దెబ్బకు పాక్ చిత్తు

భారత మహిళల జట్టు పాకిస్థాన్‌పై ఏకపక్ష విజయంతో ఆసియా కప్‌లో దూసుకెళ్లింది. గ్రూప్‌ఏ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. యువ స్పిన్నర్లు శ్రీ చరణి, ప్రేమ రావత్ చెరో మూడు వికెట్లతో పాక్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 18.1 ఓవర్లలో కేవలం 55 పరుగులకే ఆలౌటైంది. ఇది టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పాకిస్థాన్‌కు అత్యల్ప స్కోరు. గతంలో 2012 ఆసియా కప్‌లో భారత్‌పైనే 63 పరుగులు చేయడం వారి అత్యల్ప స్కోరుగా ఉండేది. షఫాలీ వర్మ మునీబా అలీని 13 పరుగుల వద్ద అవుట్ చేయగా, చరణి గుల్ ఫెరోజా (0), షవాల్ జుల్ఫికర్ (14)ను పెవిలియన్‌కు పంపింది. ప్రేమ రావత్ 3/9, దీప్తి శర్మ 2/5తో మరింత దెబ్బకొట్టారు. అనంతరం భారత్ 8.4 ఓవర్లలో 57/3 చేసి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 18 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. వరుసగా మూడో విజయంతో భారత్ ఆరు పాయింట్లు సాధించి సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. పాకిస్థాన్ రెండు పాయింట్లతో ఉండగా, చివరి మ్యాచ్‌లో హాంకాంగ్‌ను ఓడిస్తేనే సెమీఫైనల్ అవకాశాలు ఉంటాయి.



# 55కే పాకిస్థాన్ ఆలౌట్.. భారత స్పిన్ మాయ

### స్పిన్నర్ల దెబ్బకు పాక్ బ్యాటింగ్ కుప్పకూలింది

ఇది మ్యాచ్ కాదు.. భారత స్పిన్నర్లకు పాకిస్థాన్ బ్యాటింగ్‌పై పూర్తి ఆధిపత్యం. తొలుత 27 పరుగుల వరకు వికెట్ కోల్పోకుండా సాగిన పాక్.. ఆ తర్వాత భారత బౌలింగ్ ముందు నిలవలేకపోయింది. కేవలం 55 పరుగులకే ఆలౌటై, టీ20 అంతర్జాతీయ చరిత్రలో తమ అత్యల్ప స్కోరును నమోదు చేసింది.

విమెన్స్ ఆసియా కప్ గ్రూప్‌ఏలో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌కు మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మంచి ఆరంభం ఇచ్చారు. నాలుగు ఓవర్లలో 27/0తో ఉన్న పాక్‌ను భారత స్పిన్నర్లు దెబ్బతీశారు. హర్మన్‌ప్రీత్ కౌర్ 150వసారి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన మ్యాచ్‌లో పిచ్‌పై టర్న్‌ను గుర్తించి వెంటనే స్పిన్నర్లను రంగంలోకి దించారు. షఫాలీ వర్మ 3 ఓవర్లలో 1/10, ప్రేమ రావత్ 4 ఓవర్లలో 3/9తో పాక్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఆరు వికెట్లు కేవలం 9 పరుగులకే పడిపోవడంతో 10 ఓవర్లకు పాక్ 36/6గా మారింది. లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి అద్భుతంగా బౌలింగ్ చేసి 3/7తో పాక్ పతనంలో కీలక పాత్ర పోషించారు. గుల్ ఫెరోజా, షవాల్ జుల్ఫికర్‌ను చరణి పెవిలియన్‌కు పంపగా, దీప్తి శర్మ 3.1 ఓవర్లలో 2/5తో కెప్టెన్ ఫాతిమా సనా (0)ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసింది. అయేషా జాఫర్, సదాఫ్ షమాస్ కూడా ఒత్తిడిలో వికెట్లు కోల్పోయారు. ఈమాన్ ఫాతిమా రనౌట్ కాగా, ఉమ్‌ఎహనీ కూడా తప్పుడు స్వీప్ ప్రయత్నంలో అవుటైంది. మొత్తం 18.1 ఓవర్లలో భారత బౌలర్లు ఏకంగా 78 డాట్ బాల్స్ వేయడం పాక్ బ్యాటింగ్ వైఫల్యానికి అద్దం పట్టింది.




# అఫ్గాన్‌పై ఫుల్ టీమ్ ఎందుకు?

### భయంతోనే బలమైన జట్టు ఎంపిక చేశారా?

ఐర్లాండ్, ఇంగ్లండ్ పరాజయాల తర్వాత భారత సెలెక్టర్లలో భయం కనిపించిందా? అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌కు పూర్తి స్థాయి జట్టును ఎంపిక చేయడంపై 1983 ప్రపంచకప్ విజేత కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రంగా విమర్శించారు. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన సిరీస్‌లో రెగ్యులర్ ఆటగాళ్లనే తీసుకోవడం తప్పిదమని అన్నారు. ఐర్లాండ్ చేతిలో భారత్ 20తో సిరీస్ కోల్పోగా, ఇంగ్లండ్‌పై 40తో వైట్‌వాష్‌కు గురైంది. ఆ తర్వాత జింబాబ్వేపై 30తో క్లీన్‌స్వీప్ చేసినా, అఫ్గాన్ సిరీస్‌కు ఇంగ్లండ్‌తో ఆడిన జట్టుకు దాదాపు సమానమైన టీమ్‌ను ఎంపిక చేయడాన్ని శ్రీకాంత్ తప్పుబట్టారు. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఉన్న ఈ జట్టులో సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ వంటి ఆటగాళ్లు ఉన్నారు. మరోవైపు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఎంపికయ్యారు. వీరికి మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపణ కాలేదని శ్రీకాంత్ ప్రశ్నించారు. బెంగళూరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌గా ఉండటం మాత్రమే సరిపోదని, అసలు మ్యాచ్ ఫిట్‌నెస్‌నే చూడాలని స్పష్టం చేశారు.





# తొలి రోజే షాక్!

## రంభ ఊర్వశి మేనకకు నెగిటివ్ టాక్..

కామెడీ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ చాలా రోజుల తర్వాత పూర్తి స్థాయి కామెడీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆయన నటించిన తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో సురభి, రాశీ సింగ్, విష్ణుప్రియా భీమనేని, ప్రిషా సింగ్ హీరోయిన్లుగా నటించారు. వెన్నెల కిశోర్, నరేష్ వీకే, శ్రీనివాస్ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. హాస్య మూవీస్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. చాలా రోజుల తర్వాత కామెడీ బాటలోకి అల్లరి నరేష్ ఒకప్పుడు వరుస కామెడీ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్.. గత కొంతకాలంగా తన జోనర్‌ను మార్చుకున్నారు. యాక్షన్, థ్రిల్లర్ సినిమాలతో పాటు మల్టీస్టారర్ చిత్రాల్లోనూ నటించారు. అయితే ఆయన నుంచి మళ్లీ పూర్తి స్థాయి కామెడీ సినిమా రావాలని అభిమానులు చాలాకాలంగా కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'రంభ ఊర్వశి మేనక'తో తన మార్క్ కామెడీని మరోసారి చూపించే ప్రయత్నం చేశారు. భారీ అంచనాల మధ్య శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు తొలి షో నుంచే మిశ్రమ స్పందనకు బదులుగా ఎక్కువగా నెగటివ్ టాక్ వినిపించింది.

**కామెడీ వర్కౌట్ కాలేదంటున్న ఆడియెన్స్**

సినిమాలో అల్లరి నరేష్ నటన, లుక్ ఆకట్టుకున్నప్పటికీ.. ప్రధానంగా ఆశించిన స్థాయిలో కామెడీ పండలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. థియేటర్లలో ప్రేక్షకులను నవ్వించాల్సిన సన్నివేశాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయని టాక్. అయితే సినిమాలోని మదర్ సెంటిమెంట్ మాత్రం కొంతవరకు ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే సన్నివేశాలు కొంత రిలీఫ్ ఇస్తాయని అంటున్నారు. మరోవైపు రంభ, ఊర్వశి, మేనకల కాన్సెప్ట్‌ను టచ్ చేస్తూ వచ్చే సన్నివేశాలు, పాత పాటలకు సంబంధించిన కొన్ని ఎపిసోడ్స్ ప్రేక్షకులను అలరిస్తున్నాయని టాక్. అయితే ఇవి మినహా సినిమాలో చెప్పుకోదగ్గ ఆకట్టుకునే అంశాలు పెద్దగా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో సినిమాకు డిజాస్టర్ టాక్ వస్తున్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**తొలి రోజే అల్లరి నరేష్‌కు తక్కువ ఓపెనింగ్స్**

నెగటివ్ టాక్ బాక్సాఫీస్ వసూళ్లపై కూడా ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. 'రంభ ఊర్వశి మేనక' తొలి రోజు ఇండియాలో సుమారు రూ.88 లక్షల గ్రాస్ వసూలు చేసినట్లు సమాచారం. ఓవర్సీస్ కలెక్షన్లు కలుపుకుంటే మొత్తం వసూళ్లు సుమారు రూ.కోటి వరకు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక షేర్ పరంగా చూస్తే తొలి రోజు దాదాపు రూ.50 లక్షలు మాత్రమే వచ్చినట్లు సమాచారం. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లోనే అత్యల్ప ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలిచిందని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. సినిమాకు వచ్చిన నెగటివ్ టాక్ కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపినట్లు తెలుస్తోంది.

**'రంభ ఊర్వశి మేనక' బ్రేక్ ఈవెన్ టార్గెట్ ఎంత?**

ఈ సినిమాకు సుమారు రూ.15 కోట్ల బడ్జెట్ అయినట్లు సమాచారం. థియేట్రికల్ హక్కులను దాదాపు రూ.4.5 కోట్లకు విక్రయించినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన మూవీ సేఫ్ జోన్‌లోకి రావాలంటే సుమారు రూ.10 కోట్ల గ్రాస్ వసూలు చేయాల్సి ఉంటుందని అంచనా. అయితే తొలి రోజే నెగటివ్ టాక్ రావడంతో సినిమా రాబోయే రోజుల్లో ఎలా పెర్ఫార్మ్ చేస్తుందనేది కీలకంగా మారింది. వీకెండ్‌లో వసూళ్లు పుంజుకుంటే కొంతవరకు నష్టాలను తగ్గించే అవకాశం ఉంటుంది. లేదంటే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నష్టాలను చవిచూసే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే.. చాలా రోజుల తర్వాత కామెడీ జోనర్‌లోకి తిరిగి వచ్చిన అల్లరి నరేష్‌కు 'రంభ ఊర్వశి మేనక' ఆశించిన కమ్‌బ్యాక్‌ను ఇవ్వలేకపోయిందనే టాక్ వినిపిస్తోంది. మరి రాబోయే రోజుల్లో ఈ మూవీ కలెక్షన్లు పుంజుకుంటాయా లేదా అనేది చూడాలి.




# అందరూ ప్రేమలో పడతారు

నటి నిత్యామీనన్ ఇటీవలే తన సొంత నిర్మాణ సంస్థ 'కేయూరి ప్రొడక్షన్స్'ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. నటి నిత్యామీనన్ ఇటీవలే తన సొంత నిర్మాణ సంస్థ 'కేయూరి ప్రొడక్షన్స్'ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. డీకే, విక్రమ్ కె. కుమార్‌తో కలిసి తొలుత ఆమె ఫాంటసీ డార్క్ కామెడీ మూవీ నిర్మిస్తున్నారు. తాజాగా తన మొదటి చిత్రం గురించి అప్డేట్ ఇచ్చారు ఆమె. ఈ సినిమాకు డీకే దర్శకత్వం వహించనున్నట్లు తెలిపారు. గతంలో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన లియో విజన్, హీరోయిన్ నిత్యామేనన్‌కు చెందిన కేయూరి ప్రొడక్షన్స్ కలిసి 'ప్రొడక్షన్ నెం.5' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించనున్నట్లు చెప్పారు. ఇంకా పేరు ఖరారు చేయని ఈ మూవీలో నిత్యామేనన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అభిమానులకు విభిన్నమైన సినిమాటిక్ అనుభూతి అందించేలా ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచుతుందని, త్వరలోనే టైటిల్ టీజర్‌ను విడుదల చేస్తామని అన్నారు. 'వైవిధ్యమైన కథాంశంతో రూపొందనున్న ఈ సినిమాతో అందరూ ప్రేమలో పడతారు' అని పేర్కొన్నారు. కాగా తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.





## మరోసారి వాయిదా..

దసరా వంటి మాస్ బ్లాక్‌బస్టర్ తర్వాత న్యాచురల్ స్టార్ నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండవ సినిమా ది ప్యారడైజ్ ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో విశేషమైన క్రేజ్ ఉంది. కయాదు లోహార్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో విలక్షణ నటుడు మోహన్ బాబు విలన్ గా నటిస్తున్నాడు. ఇక కీర్తి సురేష్ ఒక స్పెషల్ సాంగ్ చేసింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తోన్న ప్యారడైజ్ చివరికి సెప్టెంబర్ 24న రిలీజ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే, ఈ ప్రతిష్టాత్మక చిత్రం ముందుగా అనుకున్న షెడ్యూల్ కంటే ఒక వారం రోజులు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. చిత్ర యూనిట్ శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నప్పటికీ, అనుకున్న సమయానికి కొన్ని సాంకేతిక విభాగాలు పూర్తి కాకపోవడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా సినిమాకు ఎంతో కీలకమైన విజువల్ ఎఫెక్ట్స్ వర్క్ ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. దీనితో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రీరికార్డింగ్ పనులు కూడా తుది దశకు చేరుకోలేదట. ఒకవేళ సెప్టెంబర్ విడుదల కాస్త ఆలస్యమైతే, ఈ చిత్రాన్ని అక్టోబర్ 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. అక్టోబర్ మొదటి వారంలో ఉన్న సెలవుల సీజన్ సినిమా వసూళ్లకు బాగా కలిసి వస్తుందని భావిస్తున్నారట. ఇందులో నిజమెంత అని తెలియాల్సి ఉంది.

# నవ్వించే.. చంపేలా ఉన్నాడు

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వర్సటైల్ యాక్టర్ శ్రీవిష్ణు ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. అందులో ఒకటి కామ్రేడ్ కళ్యాణ్ ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించింది. వెన్నెల కిషోర్, సత్య తదితరులు కీలక పాత్రల్లో నటించారు. తాజాగా కామ్రేడ్ కళ్యాణ్ టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. కామ్రేడ్ కళ్యాణ్ టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ టీజర్‌లో శ్రీవిష్ణు ఒక నక్సలైట్ గా, విప్లవ భావాలు కలిగిన కామ్రేడ్ కళ్యాణ్ పాత్రలో కనిపించాడు. టైటిల్ చూసి శ్రీవిష్ణు బాగా సీరియస్ గా ఉండే పాత్రలో కనిపిస్తున్నాడు అని అనుకున్నారు. కానీ టీజర్ మొదట్లోనే నక్సలైట్ అంటే నక్సల్ చేతిలో లైట్, కమ్యూనిజం అంటే ఏంటి.. కమ్యూనిస్టులు చెప్పే నిజం అంటూ చెప్పే డైలాగ్స్ తోనే ఇదొక కామెడీ ఎంటర్ టైనర్ అని అర్థమైపోయింది. ఇక టీజర్ మొత్తం నవ్వులతో ముంచేశారు. సత్యతో కలిసి శ్రీవిష్ణు పండించిన కామెడీ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. విప్లవాత్మక నేపథ్యంతో పాటు శ్రీవిష్ణు మార్క్ కామెడీ, ఎమోషన్, యాక్షన్ ఎలిమెంట్స్ సమపాళ్లలో ఉన్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఇక ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. మహిమా నంబియార్ అందం సినిమాకు మరో హైలైట్ గా నిలిచింది. ఇక ఈ చిత్రంలో రాధిక శరత్ కుమార్ బాలయ్య ఫ్యాన్ గా కనిపించింది. టీజర్ తోనే సినిమాపై ఒక రేంజ్ లో హైప్ పెంచేశారు. ఇక ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 9న రిలీజ్ చేయనున్నారు.



This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.